ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY








మంగళవారం 14 జూలై 2026 | Tuesday 14 July 2026 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 100 | Vol.No 28 Issue No .100 | www.visionandhra.in


# తెలంగాణలో ఇందిరమ్మ సంబరం

## పేదల కళ్లలో ఆనందం - ఇళ్లల్లో పండుగ




ఇందిరమ్మ ఇల్లు నమూనా...

- పేదోడి కల ఇందిరమ్మ ఇళ్లు..
- రేవంత్ సర్కారులో పల్లెల స్వరూపమే మార్పు...
- శ్రీనన్న చొరవతో సొంతింటి కల సాకారం...
- మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పూర్తి..
- ప్రతి నియోజకవర్గానికి 3000 ఇళ్లు..
- రెండో విడతకు రంగం సిద్ధం..
- సీఎం రేవంత్ మంత్రి శ్రీనన్నను ప్రత్యేకంగా అభినందిస్తున్న ప్రజలు....

"ఇల్లు కట్టు చూడు... పెళ్లి చేసి చూడు"లి అన్న పెద్దల మాటను అక్షరాలా నిజం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. తెలంగాణ పల్లెల్లో గత రెండున్నర సంవత్సరాలుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో కొత్త వసంతం వచ్చింది. పేదోడి సొంత ఇంటి కలకు రేవంత్ సర్కారు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి "శ్రీనన్న" చొరవతో మోక్షం లభించింది.




ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టిన సీఎం,డిప్యూటీ సీఎం, మినిస్టర్...ఫైల్ ఫోటో..





హైదరాబాద్, జూలై 14: (విజన్ ఆంధ్ర)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో "రెండు పడక గదుల ఇల్లు" అంటూ మాయమాటలు చెప్పి ఊరించిందే తప్ప ఇచ్చింది లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాటంటే మాట అన్నట్టు, అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఊపిరి పోసింది. ఫలితంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ దాదాపు పూర్తయి, పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది.

### పేదల పాలిట సిరుల పంట శ్రీనన్న చొరవతో పేదలకు వరం

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి "శ్రీనన్న" ఇందిరమ్మ ఇళ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఖమ్మం జిల్లా నుండి ప్రారంభమైన ఈ పథకం నేడు రాష్ట్రమంతా విస్తరించింది. ప్రతి నియోజకవర్గానికి 3000 ఇళ్లు మంజూరు చేసి, వేగంగా నిర్మాణాలు పూర్తి చేయించడంలో మంత్రి కీలక పాత్ర పోషించారు. మొదటి విడతలో పూర్తయిన కొన్ని ఇళ్లకు స్వయంగా మంత్రి శ్రీనన్న నూతన గృహప్రవేశాలు చేయడంతో పేదల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. "మా జీవితంలో ఎన్నడూ ఊహించని రోజు ఇది. మాకు సొంత ఇల్లు ఇచ్చిన శ్రీనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం" అని లబ్ధిదారులు కన్నీళ్లతో చెబుతున్నారు.

### మంత్రి పనితీరుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిదా...

మొదటి విడత విజయవంతం కావడంతో సీఎం కార్యాలయంలో మంత్రి శ్రీనన్నను రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. శ్రీనన్న ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో మొదటి విడత విజయం సాధించింది ఆయన అభిప్రాయపడ్డారు..



ఖమ్మం జిల్లాలోని మంత్రి సొంత గ్రామంలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి శ్రీనన్న... (ఫైల్ ఫోటో)

### గతం - వర్తమానం

బీఆర్ఎస్ హయాంలో 10 ఏళ్లు మాయమాటలు, రెండు పడక గదుల పేరుతో ఓట్లు దండుకోవడం, కానీ పేదలకు ఇళ్లు లేవని విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ హయాంశ్రీశీ 2.5 ఏళ్లలోనే మొదటి విడత పూర్తి చేసి,ప్రతి నియోజకవర్గానికి 3000 ఇళ్లు, పారదర్శకంగా పంపిణీ చేశాం అని కాంగ్రెస్ నాయకులు గర్వాంగా చెబుతున్నారు. 2004లో వైస్సార్ ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లను ఆదర్శంగా తీసుకుని, జవీ రేవంత్ రెడ్డి దాన్ని మరింత పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్తున్నారు. గతంలో ప్రతి పల్లెలో 50-100 ఇళ్లు ఇస్తే, ఇప్పుడు ప్రతి గ్రామంలో 100కు పైగా ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నారు.

### పల్లెల్లో కొత్త కాలనీలు, కొత్త ఆశలు

ఇందిరమ్మ ఇళ్ల వల్ల పల్లెల్లో కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయి. పేదలు గుడిసెల నుండి పక్కా ఇళ్లకు మారుతున్నారు. దీంతో పిల్లల చదువు, ఆరోగ్యం, సామాజిక స్థాయిలో పెద్ద మార్పు వస్తోంది.

"మాకు భూమి లేదు, డబ్బు లేదు. సొంత ఇల్లు అనేది కల లాంటిది. కానీ ఇందిరమ్మ ఇల్లు రావడంతో మా బతుకులు మారిపోయాయి" అని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అవ్వతో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం...

### రెండో విడతకు సిద్ధం

మొదటి విడత విజయంతో ఉత్సాహంగా ఉన్న ప్రభుత్వం రెండో విడతకు రంగం సిద్ధం చేస్తోంది. మరో రెండు నెలల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ మొదలవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. వచ్చే రెండున్నర సంవత్సరాల్లో 10 నుండి 15 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి విడతలో ఇల్లు దక్కని లబ్ధిదారులకు రెండు, మూడు విడతల్లో ప్రాధాన్యత ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

### పేదలందరికీ కాంగ్రెస్ వరం

"కాంగ్రెస్ అంటేనే పథకాలు, పథకాలు అంటేనే కాంగ్రెస్" అనే నమ్మకాన్ని రేవంత్ సర్కారు మరోసారి నిలబెట్టింది. ఇందిరమ్మ పేరుతో పేదలకు సొంత ఇంటి కలను నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది. ఇందిరమ్మ ఇళ్లతో తెలంగాణ పల్లెల స్వరూపమే మారిపోయింది. పేదోడి గుండెల్లో ఆశలు చిగురించాయి. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వానికి అసలైన విజయం....

- (అప్పన్న వంశీకృష్ణ...)

విద్యార్థుల్లో కులవివక్షను

# దూరం చేస్తున్నాం

- యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యాభివృద్ధి
- ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో సీఎం రేవంత్



హైదరాబాద్,జులై13 : జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాతో ముఖ్యమంత్రి మిగతా 2లో..

# కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- పార్లమెంటులో వివిధ సమస్యలపై ప్రస్తావించాలి
- మెట్రో, ట్రిపుల్ ఆర్ తదతిర అంశాలపై అనుమతులు రాబట్టాలి
- ఎంపీలతో ప్రజాభవన్‌లో సిఎం రేవంత్ భేటీ
- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు
- సమావేశంలో సలహాదారు జితేందర్ రెడ్డి, ఎంపీలు హాజరు




హైదరాబాద్,జులై13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలం అని మిగతా 2లో..

# బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు

- తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం స్పష్టీకరణ
- పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని వెల్లడి

న్యూఢిల్లీ,జూలై13 : పోలవరం, గోదావరి నీటి వినియోగం, బనకచర్ల మిగతా 2లో..

సింగరేణిని భ్రష్టు పట్టించిన

# బిఆర్ఎస్, కాంగ్రెస్

- గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారు
- అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోంది
- సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం,జూలై13 :సింగరేణిలో ప్రస్తుత పరిస్థితికి కారణం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో డబ్బులు తీసుకుని మైన్స్ కేటాయించారని ఆరోపించారు. సింగరేణిని అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ అక్రమంగా కేటాయించిన మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసిందని.. బొగ్గు గనులను పారదర్శకంగా కేటాయించాలని స్పష్టం మిగతా 2లో..

# ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం




- మూడు దశల ముందస్తు కార్యాచరణ
- ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో మంత్రి తుమ్మల ఉన్నతస్థాయి సమీక్ష
- కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి
- వాతావరణ, భూగర్బజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై బులెటిన్ విడుదల
- 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినోపై రైతులకు ప్రత్యేక అవగాహన
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్,జులై13 : ఎల్-నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ లో భారత వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ మిగతా 2లో..

# సింగరేణి అధికారుల సమస్యలపై సత్వర నిర్ణయం


- సింగరేణి యాజమాన్యానికి భట్టి విక్రమార్క ఆదేశాలు



హైదరాబాద్,జులై13 :సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 2,200 మంది అధికారులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై వీలైనంత త్వరగా సానుకూల మిగతా 2లో..

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

- 2 ఏళ్లల్లో ఇరిగేషన్ రంగానికి రూ.24 వేలకోట్లు ఖర్చు
- ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు
- డబ్బులిచ్చి మరీ గొడ్డలి పార్టీ అరాచకాలు సృష్టిస్తోంది
- పవన్ ను అవమానిస్తున్నారు... వాళ్ల కుటుంబ సభ్యులను కించపరుస్తున్నారు
- పిచ్చుకలంకలో రైతుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ధవళేశ్వరం బ్యారేజీకి రూ.153 కోట్లతో 117 కొత్త గేట్ల ఏర్పాటు పనులు ప్రారంభించిన ముఖ్యమంత్రి



కొత్తపేట, జులై 13 : గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీంట్లో భాగంగానే సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమరుస్తున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజీకి రూ.152.95 కోట్ల వ్యయంతో 117 కొత్త గేట్లను అమర్చే పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ మేరకు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ముఖ్యమంత్రి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నెలకు కొత్తగేట్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు గేట్లను అమర్చే పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ప్రస్తుతం సముద్రంలోకి ఎంత నీరు వెళ్తోందని సీఎం చంద్రబాబు ఆరా తీశారు. ప్రస్తుతం 27 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తోందని అధికారులు మిగతా 2లో..

# నరహంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా పెంజర్ల పొలాల్లో మృతదేహం, • స్థానికుల సమాచారంతో రాజ్‌కుమార్ గుర్తింపు, • మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ లభ్యం, • శవం పక్కనే ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు, • హత్యకు ముందు వీడియో కాల్ రికార్డు చేసిన హంతకుడు



రంగారెడ్డి,జూలై13 : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్‌కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్‌కుమార్‌గా మిగతా 2లో..

విజన్ ఆంధ్ర



## సింగరేణి అధికారుల సమస్యలపై సత్వర నిర్ణయం

నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. కోల్ ఇండియా సంస్థ మాదిరిగా సింగరేణి అధికారుల వేతన సవరణ, పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ అమలుకు సంబంధించి అధికార సంఘం నాయకులు చేసిన విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇటీవల ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో తాడిచర్ల-2 బ్లాక్‌ను మైనింగ్ లీజు మంజూరు కావడంలో భట్టి విక్రమార్క పోషించిన కీలక పాత్రకు కృతజ్ఞతలు తెలుపుతూ సింగరేణి అధికార సంఘం నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అధికారులకు సంబంధించిన వివిధ సమస్యలను త్వరగా పరిష్కరించేలా సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని ఆయనను కోరారు. విజ్ఞప్తులపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం ఉదయం సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్ ,గౌతమ్ పొట్రుతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం సింగరేణి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇంధన భద్రతను అందించడంలో సింగరేణి కార్మికులు, అధికారులు విశేష కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారుల్లో ఎలాంటి అసంతృప్తి నెలకొనకుండా వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికార సంఘం నాయకులతో చర్చించి వారికి భరోసా కల్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా రానున్న రెండు నుంచి మూడు నెలల్లో అధికారుల విజ్ఞప్తులపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, మారుతున్న ప్రపంచీకరణ పరిస్థితులు, పెరుగుతున్న పోటీని దృష్టిలో ఉంచుకొని బొగ్గు ఉత్పత్తి, విక్రయాల్లో సింగరేణి పోటీతత్వాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సింగరేణిని బహుముఖ రంగాల్లో విస్తరించి అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దేందుకు అధికారులు కీలక పాత్ర పోషించాలని, ఈ దిశగా అధికార సంఘం నాయకులు కూడా అధికారుల్లో సానుకూల దృక్పథం, కార్యోన్ముఖత పెంపొందించేలా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. సింగరేణి సుస్థిర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సింగరేణి అధికార సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్కను కలిసి తమ సమస్యలను వివరించామని, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి సత్వరమే పరిష్కరించాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయడంపై వారు ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి అభివృద్ధి, విస్తరణ, సుస్థిర భవిష్యత్ కోసం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి అధికారుల తరఫున సంపూర్ణ మద్దతు అందిస్తూ, సంస్థ పురోగతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.

## విద్యార్థుల్లో కులవివక్షను దూరం చేస్తున్నాం

రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు కీలక చర్యలు చేపట్టామని వ్యాఖ్యానించారు. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే అకడమిక్ ఇయర్ నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని సీఎం వ్యాఖ్యానించారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ స్కూల్లోనే అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ లోపల ఉన్న ప్రాంతంలో మొదటగా వీలైనన్ని తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను పెంచుతున్నామని వివరించారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలను కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. రాజకీయాల్లో, ఇతర రంగాల్లో కీలక స్థానాల్లో ఎస్సీలకు అవకాశాలు కల్పించామని వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కేంద్ర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ కు ఎఐఓ ను తీసుకురావాలి. ఇందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలన్నారు. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. మెట్రో విస్తరణకు సంబంధించి రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని అన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని దాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్స్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్ తో చర్చించాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఇవ్వాల్సి ఉంది. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు ఔక్షఅ ఇవ్వాల్సి ఉంది. 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చు.గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుంది. కేంద్రం సహకరిస్తే కేంద్రం సహకరించిందని మేం నిరభ్యంతరంగా చెబుతాం. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవని అన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఎంపిలతో భేటీలో రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలతో పాటు బిజెపి ఎంపిలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## బనకచర్లపై నోటీసులు ఇవ్వడం కుదరదు




అనుసంధానం అంశాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ వేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలని, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది. తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రధాన పిటిషన్‌లో లోపాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. లోపాలు సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. లోపాలు సరిదిద్దాక విచారణలో మిగతా అంశాలు పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. పిటిషన్‌పై విచారణ జరపకుండా నోటీసులివ్వలేమని తెలిపింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా, ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయ్యిందంటూ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని స్పష్టం చేసింది. రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇటువంటి ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా చాంబర్ జడ్జి ముందు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు ఇవ్వకుండా నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అయితే, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదననూ సుప్రీంకోర్టు పట్టించుకోలేదు.

## సింగరేణిని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్, కాంగ్రెస్

చేసిందని తెలిపారు. సింగరేణిలో కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణికి నైనీ కోల్ బ్లాక్ కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమానికి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇప్పటివరకు వేలం ద్వారానే బొగ్గు గనులు కేటాయిస్తూ వచ్చామని అన్నారు. మోదీ ప్రభుత్వం వేలం లేకుండా ఇచ్చిన ఏకైక బ్లాక్.. తాడిచర్ల-2 అని తెలిపారు. సింగరేణికి అండగా ఉండాలనే ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సింగరేణిలో బొగ్గు మాయమైందని కేటీఆర్, హరీశ్ లేఖలు రాసినట్లు చెప్పారు. 'సింగరేణి అంశంలో కేంద్రం తలదూర్చదని మీకు తెలియదా? మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు సింగరేణి డబ్బు ఖర్చు చేస్తారా? సింగరేణిని అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేశారు' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్ల పాటు సింగరేణిని కేసీఆర్ ఓటు బ్యాంకుగా చూశారని వ్యాఖ్యానించారు. సింగరేణికి చేసిన మేలు ఏమిటో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌పై మాత్రం కేసీఆర్ మాట్లాడలేదన్నారు. సింగరేణిలో ఏం జరిగినా కేంద్రాన్ని సంప్రదించడం లేదన్నారు. సింగరేణిపై కేంద్రం పెత్తనం ఉండదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వాల విధానాలపై మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో దేశంలో అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, అనంతరం బొగ్గు బ్లాకుల కేటాయింపులు పారదర్శకంగా జరగాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వేలం ప్రక్రియ లేకుండానే సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ను కేటాయించిందని తెలిపారు. ఈ బ్లాక్‌లో గ్రేడ్-8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, మరో 40 నుంచి 50 సంవత్సరాల వరకు సింగరేణి అవసరాలను తీర్చగల సామర్థ్యం ఉందని చెప్పారు. సింగరేణి సమస్యలను తాను పలుమార్లు ప్రధాని దృష్టికి తీసుకెళ్లానని, సంస్థకు మరిన్ని బొగ్గు బ్లాకులు అవసరమని కేంద్ర ప్రభుత్వానికి వివరించానని కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం సింగరేణి ఎదుర్కొంటున్న పరిస్థితులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారపూరిత నిర్ణయాలు, సింగరేణిని కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడమే సంస్థ పరిస్థితి దిగజారడానికి దారితీసిందని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగరేణికి చేసిన మేలు ఏమిటో ప్రజలకు చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. సింగరేణి నుంచి తీసుకున్న బొగ్గు, విద్యుత్ బకాయిలను చెల్లించకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం సుమారు రూ.24 వేల కోట్ల అప్పు మిగిల్చిందని ఆరోపించారు. రాష్ట్రంలో 49 శాతం వాటా ఉన్నప్పటికీ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి అభివృద్ధి కోసం కేంద్రాన్ని సమర్థవంతంగా సంప్రదించలేదని, ఈ రెండు పార్టీలు సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించుకున్నాయని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# ఎల్-నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సన్నద్ధం

విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మి÷-లలెట్స్ రీసెర్చ్, సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను ఈ సమావేశంలో సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తుది కార్యాచరణపై మంత్రి చర్చించారు.ముందుగా వివిధ ఇన్స్టిట్యూషన్స్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎల్-నినో పరిస్థితులను తట్టుకునేవిధంగా వారు వారు సిద్ధం చేసిన కార్యచరణను మంత్రికి తెలియచేశారు. ముఖ్యంగా కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా తట్టుకొనే పంటలు మరియు రకాలు, ఇప్పటికే సాగు చేసిన పంటలలో తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి యాజమాన్య చర్యను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, జిల్లాల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అనుబంధరంగ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. తరువాత మాట్లాడిన వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎల్-నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం వంటి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. జూలై 15 వరకు వర్షాలు ఆలస్యమైతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, జూలై 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగస్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసి ముందుగానే అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వర్షాభావ జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాల్సిందిగా సూచించారు.

శాస్త్రీయ విధానాలతో ఎల్-నినోను ఎదుర్కోవాలని, దీనికి సంబంధించి రాష్ట్రంలో విధానాన్ని అమలు చేయాలని మంత్రి సూచించారు. ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళిక, పొలంలోనే నేల తేమ సంరక్షణ చర్యలు, పంటల వైవిధ్యీకరణ వంటి శాస్త్రీయ విధానాలను అమలు చేయాలని ఆదేశించారు. వాతావరణ, భూగర్భజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై మండలాల వారీగా వారపు బులెటిన్ విడుదల చేయనున్నారు. ఎల్-నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలంటే వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని మంత్రి తుమ్మల అన్నారు. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో ప్రతి వారం మండలాల వారీగా సమగ్ర వ్యవసాయ-వాతావరణ బులెటిన్ విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల లభ్యత, సాగునీటి పరిస్థితి, విద్యుత్ సరఫరా, పంటల స్థితి, రైతులు చేపట్టాల్సిన యాజమాన్య చర్యలతో పాటు నీటిపారుదల శాఖ ప్రాజెక్టుల క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో ఈ నెల, వచ్చే నెలకు సంబంధించిన వాతావరణ అంచనాలను విశ్లేషించి, ఆయా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉండే నీటి నిల్వలు, ఖచ్చితమైన అంచనాలను కూడా బులెటిన్‌లో పొందుపరచాలని మంత్రి స్పష్టం చేశారు. ఇక్రిశాట్‌లో జరిగిన సమీక్షలో శాస్త్రవేత్తలు వర్షాకాలం ఆలస్యంగా ప్రారంభమవడం, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక సూచనలు చేశారు. మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలకు అనుగుణంగా అవసరమైన విత్తనాలను ముందుగానే సమీకరించామని, మార్క్‌ఫెడ్, విత్తన సంస్థలు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ రైతులకు ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినో ప్రభావాలు, ప్రత్యామ్నాయ సాగు, నీటి యాజమాన్యం, నేల తేమ సంరక్షణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ పద్ధతులు, శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య చర్యలపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు.

ప్రతి రైతు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో మార్గనిర్దేశర చేస్తారని చెప్పారు. ఎల్-నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నా రైతు నష్టపోకుండా అవసరమైన ప్రతి చర్య తీసుకుంటాం. శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి వ్యవసాయ యాజమాన్య పద్ధతిని క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, వాటిని అమలు చేసే బాధ్యత జిల్లా యంత్రాంగం తీసుకోవాలి.

ప్రతి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం అన్ని విధాలుగా రైతుకు అండగా ఉంటుంది.' అని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, ఇక్రిశాట్ డిప్యూటి డైరెక్టర్ జనరల్ స్టాన్ఫోర్డ్ బ్లేడ్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, కమిషనర్ కోఆపరేషన్ రాహుల్ రాజ్, హాకా ఎండి చంద్రశేఖర్, గిడ్డంగుల శాఖ ఎండి లక్ష్మీ, ఉిఱఖఆఱఅ అఓఆ జితేష్ పాటిల్, అగ్రి, హార్టికల్చర్ యూనివర్సిటీల వీసీలు జానయ్య, రాజిరెడ్డి, ఇక్రిశాట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ హరికిషన్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి డెల్టాకు శాశ్వత భద్రత

వివరించారు. అలాగే కాల్వలకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేశారని ముఖ్యమంత్రి అడిగారు. 14,700 క్యూసెక్కుల నీరు కాల్వలకు వదిలామని అధికారులు చెప్పారు. కాల్వ చివరి భూములకూ నీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని పిచ్చుకలంకలో రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి డెల్టాకు దేశానికే అన్నపూర్ణ అనే ఖ్యాతి రావడానికి సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టే కారణమని, అనంతరం ఎన్టీఆర్ హయాంలో నిర్మించిన కొత్త బ్యారేజీతో మరో పంటకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. 2.9 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం, 32.2 లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకునే సామర్థ్యంతో పాటు ఈస్ట్రన్, సెంట్రల్, వెస్ట్రన్ డెల్టాల్లో కలిపి 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా బ్యారేజీ ఉపయోగపడుతోందన్నారు. అయితే 50 ఏళ్లకు పైగా గేట్లు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థలు పాతబడటంతో వాటి ఆధునీకరణ అత్యవసరమైందని ముఖ్యమంత్రి చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.32 కోట్లతో కొత్త గేట్లను అమర్చిందని, ఇప్పుడు మిగిలిన పాత గేట్ల స్థానంలో 117 కొత్త గేట్లను తొమ్మిది నెలల్లో అమర్చేలా చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. గత పాలకులు ఇరిగేషన్ ప్రాజెక్టులను కనీస నిర్వహణ కూడా చేపట్టలేదని విమర్శించారు. గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని... కనీసం గ్రీజ్ పెట్టేందుకు అవసరమైన నిధులను కూడా గత పాలకులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి అన్నారు. తుంగభద్ర ప్రాజెక్టుకు మొత్తంగా కొత్త గేట్లను బిగించామని వివరించారు. తాము గత రెండేళ్లలోనే సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లు వెచ్చించామని ముఖ్యమంత్రి తెలిపారు.పోలవరం నిర్వాసితులను ఆనందంగా ఉంచుతాంఒకప్పుడు కోనసీమలో వరికి మద్దతు ధర లేక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి నెలకొంటే, ఇప్పుడు రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని సీఎం విమర్శించారు. 2014-19 మధ్య 72 శాతం పనులు పూర్తిచేయగా, ఆ తర్వాత ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే జరిగాయని అన్నారు. టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికే పోలవరం పూర్తయ్యేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు వేగవంతమై ప్రస్తుతం 89 శాతం పురోగతి సాధించామని తెలిపారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, పునరావాసం, పరిహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. వారిని ఆనందంగా ఉంచుతామని... అనుకున్న సమయానికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రకటించిన క్యాలెండర్ కు అనుగుణంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు చేపడుతోందని చెప్పారు. పోలవరం పూర్తయితే గోదావరి జిల్లాలకు నీటి సమస్య శాశ్వతంగా తీరుతుందని, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టా, రాయలసీమకు తరలించి అక్కడి వ్యవసాయ రూపురేఖలనే మార్చామని ముఖ్యమంత్రి వివరించారు. మైక్రో ఇరిగేషన్ విస్తరించడంతో ఉద్యాన పంటలు అభివృద్ధి చెందాయని, పరిశ్రమలకు నీటి సరఫరా సాధ్యమై కియా వంటి భారీ పరిశ్రమలు రాయలసీమకు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.కూటమిపై గోదావరి జిల్లాల ప్రజల అభిమానం తరగనిదిగోదావరి ప్రజలు అభివృద్ధిని ఆదరించే స్వభావం కలవారని, గతంలోనూ టీడీపీకి అపూర్వ ఆదరణ ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూటమికి ఇచ్చిన భారీ విజయాన్ని రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చిన ఆశీర్వాదంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సహకారం, భగవంతుడి ఆశీస్సులతో ఆర్థిక సవాళ్లను అధిగమించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పుష్కర ఘాట్ల అభివృద్ధితో పాటు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో సుమారు రూ.1,200 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు.

పిచ్చుకలంక, బొబ్బర్లంక ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని, కోనసీమకు రైల్వే లైన్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. కోవ్వూరులో కోకో సిటీ ఏర్పాటు చేయనున్నట్లు కూడా ప్రకటించారు. ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, మెట్ట ప్రాంతాల్లో పామాయిల్, కోకో సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని చెప్పారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో శాస్త్రీయ విధానాలు అనుసరించాలని సీఎం సూచించారు.అభివృద్ధి-సంక్షేమమే కూటమి లక్ష్యంరాష్ట్ర పునర్నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నెలలోనే తల్లికి వందనం నిధులు జమ చేస్తామని, సామాజిక భద్రత పెన్షన్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ ప్రజల మధ్యకే రావాలనే తపనతో ఉన్నారని, ముంబై వెళ్లి ఆయనను పరామర్శించి పూర్తిగా కోలుకున్న తర్వాతే ప్రజాసేవలో పాల్గొనాలని సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్, రౌడీయిజంపై రాజీపడబోమని సీఎం హెచ్చరించారు. మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. గంజాయిని ప్రోత్సహించే వారిపైనా, మహిళలను కించపరిచే వారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రౌడీలతో, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ లను మించి గొడ్డలి పార్టీతోనే సమస్యలు సృష్టిస్తోందని సీఎం మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని... ఆడవాళ్లని అసభ్యంగా మాట్లాడే వారిని గొడ్డలి పార్టీ సమర్థిస్తోందని విమర్శించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ... గొడ్డలి పార్టీ నేతలు ఫైనాన్స్ చేస్తున్నారు.. స్టూడియోలు పెట్టిస్తున్నారని విమర్శించారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను గొడ్డలి పార్టీ సపోర్ట్ చేస్తోందని... వారికి డబ్బులిచ్చి ప్రొత్సహిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. వీళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, పొంగూరు నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నరహంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య

నిర్ధారించారు. మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్‌ను గుర్తించారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఓ బాలికను వేధించిన వ్యవహారంలో తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఉన్మాదిగా మారి నరమేధం సృష్టించాడు. తొలుత బాలిక తల్లి, నానమ్మలను కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. హైదరాబాద్-బెంగళూరు హైవేల్లోని హోటళ్లు, లాడ్జీలు, దాబాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి కుటుంబసభ్యులు, సన్నిహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతికి ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. మృతదేహం పక్కన ఉన్న అతడి మొబైల్ ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించినట్లు ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. రాజ్‌కుమార్‌కు బెట్టింగ్ అలవాటు ఉందని.. దీనికోసం 16 సిమ్‌లు వినియోగించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పుల బాధతో జీవితంపై విరక్తి కలిగిందని.. ఓ అమ్మాయిని నమ్మి చాలా మోసపోయానని సెల్ఫీ వీడియోలో రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. 2.26 సెకన్ల నిడివి గల ఈ వీడియోను మీడియా ప్రతినిధులకు సీపీ చూపించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీడియో రికార్డు చేసినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో బాలిక సహా ఆరుగురిని అత్యంత దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే.

ఆ కేసు హంతకుడు రాజ్‌కుమార్ మృతదేహం అతని మేనమామ ఊరు కొత్తూరు మండలం పంజర్లలో లభ్యమైనట్లు చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు సమీపంలోని ఓ వెంచర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ మృతదేహం రాజ్‌కుమార్‌దేనని డీసీపీ ధ్రువీకరించారు. రాజ్‌కుమార్ పాయిజన్ సేవించి ఆత్మహత్య చేసుకున్నాడని డీసీపీ పేర్కొన్నారు. ఘటనాస్థలిలో పాయిజన్ బాటిల్ లభ్యమైందని తెలిపారు. ఆ ఆధారాలను సేకరించిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. కాగా, షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యల ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా, ఈరోజు అతడి మృతదేహం లభ్యమైంది. సంచలనం సృష్టించిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్‌కు సంబంధించిన పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జూన్ 12న పోక్సో కేసులో కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో అతడు కోర్టులో చేసిన వాదనలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.ం

బెయిల్ విచారణ సందర్భంగా.. తనపై నమోదైన పోక్సో కేసు తప్పుడు కేసు అని రాజ్‌కుమార్ కోర్టుకు తెలిపినట్లు సమాచారం. బాధిత బాలిక తండ్రి తన వద్ద అప్పు చేశాడని, ఆ డబ్బులు తిరిగి అడిగినందుకే తనపై కేసు పెట్టారని వాదించాడు. ఫిర్యాదు చేసిన రోజు తాను అక్కడే లేనని, ఆ సమయంలో భార్యతో కలిసి ఆస్పత్రికి వెళ్లినట్లు కోర్టులో తెలిపాడు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం.. మైనర్ బాలికకు సంబంధించిన కేసు నమోదైన తర్వాత రాజ్‌కుమార్ కుటుంబంలో విభేదాలు మరింత పెరిగాయి. ఈ వ్యవహారం తర్వాత అతడి భార్య సరిత విడాకులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఇదే విషయంపై రాజ్‌కుమార్ తీవ్ర ఆగ్రహానికి గురై, పలుమార్లు సరితను చంపేస్తానని బెదిరించినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. పోలీసుల దర్యాప్తు ప్రకారం.. హత్యలకు ముందు రాజ్‌కుమార్ సాధారణంగానే వ్యవహరించినట్లు గుర్తించారు. ఘటనకు కొన్ని గంటల ముందు తన కుమారుడితో కలిసి బయటకు వెళ్లి ఆడించడంతో పాటు హెయిర్ కటింగ్ కూడా చేయించినట్లు సమాచారం. అదే రోజు ఉత్సాహంగా ఇంటికి వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులపై దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
మంగళవారం14-7-2026


# సంపాదకీయం

## గ్రామాల అభివృద్ధి పట్టని పాలకులు !

పల్లె కన్నీరు పెడుతోంది. మంచినీటి కోసం కన్నీరు పెడుతోంది. సాగునీటి కోసం రైతన్న కన్నీరు పెడుతున్నాడు. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరించామన్న పెద్దమనుషులు గ్రామాలకు వస్తే..చెరువులు ఎలా ఉన్నయో కనిపిస్తాయి. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం అంతా బోగస్. ఎక్కడా చెరువుల పునరుద్ధరణ జరగలేదు. జరిగితే ఇవాళ చెరువుల్లో నీటి చుక్కకూడా లేకుండా పోదు. వర్షాలు వెనక్కి పోవడంతో గ్రామాల్లో మంచినీటి సమస్యల తరుముకు వస్తోంది. పట్టణాల్లో ఇప్పుడిప్పుడే మళ్లీ ట్యాంకర్లు తిరుగుతున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం వల్ల భూగకభ జలాలు వట్టి పోయాయి. తాత్కాలిక చర్యలతో ప్రభుత్వాలు ఏళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చాయి. ఈ క్రమంలో ఏళ్లుగా గ్రామాలు కునారిల్లుతున్నాయి. కనీస వసతులు లేవు. గ్రామాల అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. అమరావతి పేరుతో ఎపిలో గ్రామాలను పట్టించు కోవడం లేదు. బలవంతంగా రైతుల నుంచి భూములు లాక్కుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పంటలు వేసుకున్న పొలాలను జెసిబిలతో దున్నుతూ రైతులను వీధుల్లో పడేస్తున్నారు. వారికి గౌరవప్రదమైన పరిహారం కూడా చెల్లించడం లేదు. చంద్రబాబు నిరంకుశ విధానాలకు ఇది పరాకాష్టగా నిలుస్తోంది. తెలంగాణో ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుద్ధరణ వంటి వాటికి ఇస్తున్న ప్రాధాన్యం గ్రామాలకు దక్కడం లేదు. దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ప్లాస్టిక్ భూతంలా వెన్నాడుతోంది. పర్యావరణం దెబ్బతింటోంది. మొక్కలు నాటడం లేదు. కోతులను తరమడం లేదు. భూగర్భ జలాలను పెంచే ప్రయత్నాలు సాగడం లేదు. ఈ సమస్యలన్నీ పరిష్కరించలేని వేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. ప్రజల భాగస్వామ్యంతోనే ఇవన్నీ సాధ్యం. అలాగే ప్రజలను బాధ్యులుగా కూడా చేయాలి. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి బయటపడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు బాధ్యులను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను పురోగించేలా చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపతేం చేస్తూ పోవాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యవసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. ఎందుకంటే రోడ్డు రవాణాను విస్తరిస్తే గ్రామాలు వాటంతట అవే పురోగమిస్తాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గుతంది. పదిశాతం దృష్టి గ్రామాలపై పెట్టినా అవి అల్లుకు పోతాయి. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పటు గ్రామాలు పురోగమిస్తాయి. చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోటీపడటం... తప్పు లేదు. అందుకు తగ్గట్లుగా గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయగలిగితేనే ఇది సాధ్యం అవుతుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయ రంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని స్థానిక వనరులను ఉపయోగించుకుంటే అభివృద్ధికి దోహదపడగలదు.చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఓవైపు రాష్ట్రమంతటా ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. అప్పుడప్పుడు మబ్బులే తప్ప వానలు పడటం లేదు. ఒక్కోరోజు వాతావరణం ఎండాకాలాన్ని తలపి స్తున్నది. పంటలు సాగు చేసేందుకు రైతులు వెనుకాడుతున్న పరిస్థితి కనపడుతోంది. గతేడాది కంటే ప్రస్తుతం రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనుంది. దేశంలో పంటల సాగుపై ఎల్ నినో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నది. ఎల్ నినో తీవ్ర రూపం దాల్చడంతో వానలు కరువయ్యాయి. మబ్బులే తప్ప చినుకు జాడలేదు. ఇప్పటివరకు రాష్ట్రంలో 21శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలుపడలేదు. జూలై సగం నెల గడుస్తున్నా వానలు ముఖం చాటేసాయి.

## విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రచార దళ్ ప్రముఖుడిగా నియమితులైన దేవులపల్లి ఎల్లయ్యకు ఘన సన్మానం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూలై 13విశ్వహిందూ పరిషత్ ప్రచార దళ్ ప్రముఖుడిగా నియమితులైన దేవులపల్లి ఎల్లయ్యను తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువ కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కప్పర ప్రసాద్ రావు మాట్లాడుతూ, విశ్వహిందూ పరిషత్ దేశభక్తి, ధార్మిక చైతన్యం, భారతీయ సంస్కృతి పరిరక్షణకు విశేష కృషి చేస్తోందని అన్నారు. ప్రచార దళ్ ప్రముఖుడిగా దేవులపల్లి ఎల్లయ్యకు లభించిన బాధ్యత గౌరవప్రదమైనదని, ఆయన తన అనుభవంతో సంస్థ బలోపేతానికి కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలో జాతీయ భావన, సేవా దృక్పథం, సాంస్కృతిక విలువలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. దేవులపల్లి ఎల్లయ్య మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన విశ్వహిందూ పరిషత్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ ఆశయాలకు అనుగుణంగా నిబద్ధతతో పనిచేస్తూ సమాజ సేవకు అంకితభావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మరాఠీ కృష్ణమూర్తి, మేడ్చల్ ‌ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు వల్లప్ప శ్రీనివాస్, గజ్వేల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎల్లంరాజు తదితరులు పాల్గొని దేవులపల్లి ఎల్లయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజా ఫిర్యాదులపై బాధ్యతాయుతంగా స్పందించాలి

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప,జూలై 13( విజన్ ఆంధ్ర)ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు సోమవారం కలెక్టరేట్ సభాభవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అధికారులు అలసత్వం వీడి ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. భూ సంబంధిత సమస్యలను రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలనలో పీజీఆర్ఎస్ నిర్వహణలో జిల్లా పనితీరు మెరుగ్గా ఉన్నప్పటికీ, అర్జీల పరిష్కారంలో ఆలస్యం లేకుండా అన్ని శాఖలు మరింత అప్రమత్తంగా పనిచేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన చేసి, అర్జీదారులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులు తెలుసుకొని సరైన సమాధానాలు ఇవ్వాలని, పొంతనలేని నివేదికలు సమర్పించరాదని అధికారులను హెచ్చరించారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ఎప్పటికప్పుడు



అందుబాటులో ఉండి సమాచార లోపాలు లేకుండా చూడాలని సూచించారు. పిజిఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన అర్జీలపై ప్రజల సంతృప్తి (పబ్లిక్ సాటిస్ఫాక్షన్) స్థాయిని కూడా ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అందువల్ల ప్రతి ఫిర్యాదును నాణ్యతతో పరిష్కరించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి డీపీవో వెంకటసుబ్బయ్య, ఎస్.ఎస్.ఈ. ఏపిసి అనురాధ,డీఆర్‌డీఏ పీడీ జి. రాజ్యలక్ష్మి,డీఎస్ఓ రఘురాం, డిఎంహెచ్ఓ డా. రవిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లా చేపడుతున్న అభివృద్ధి సమీక్ష సమావేశంలో సంబంధిత అధికారులతో పాల్గొన్న జిల్లా కలెక్టర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూలై 13సిద్దిపేట జిల్లా జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారుసోమవారం ఉదయం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ప్రగతి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్ల పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, వారానికి కనీసం ఒకసారి ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. శానిటేషన్ డ్రైవ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, స్పెషల్ ఆఫీసర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారువిద్యార్థులకు హాస్టళ్లు, పాఠశాలల్లో నాణ్యమైన భోజనాన్ని అందించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వనమహోత్సవం కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి శాఖ తప్పనిసరిగా పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గతంలో ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటిన కార్యక్రమాన్నివిజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొంటూ, ఈ



ఏడాది కూడా ప్రతి ఉద్యోగి ఒక మొక్కను నాటేలా ప్రత్యేక ప్రణాళికరూపొందించినట్లు తెలిపారు. అలాగే విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ప్రకృతి, పోషకాహారంపై అవగాహన పెంపొందించాలని సూచించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ అందేలా ప్రత్యేక నమోదు కార్యక్రమం (స్పెషల్ డ్రైవ్) నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు యూనిఫాంలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

## ఉపముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు - జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జూలై 13 ( విజన్ ఆంధ్ర బ్యూరో)ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈనెల 14న వివిధ విద్యుత్ ఉపకేంద్రాల ప్రారంభోత్సవం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం మల్దకల్ మండలం కుర్తి రావులచెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి కేంద్రం ప్రారంభోత్సవం అనంతరం సమీపంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ గురించి స్థానిక బూత్ లెవెల్ అధికారులతో మాట్లాడారు. గ్రామంలోని యువత, బిఎల్ఎలు, వాలంటీర్ల సహకారం తీసుకొని ఎన్యుమరేషన్ ఫారాలను పూరించాలన్నారు. ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ ఝాన్సీ రాణి, ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి, గ్రామ సర్పంచ్ భగవంతు, విద్యుత్ శాఖ అధికారులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## కుల రాజకీయం కాదు.... ప్రజా సంక్షేమమే ముఖ్యం!!

-నా కులాన్ని నీను తిడుతానా?
ఎల్బీనగర్ కాంగ్రెస్ లో ఏం జరుగుతుందో?
- కాంగ్రెస్ పార్టీలో చిచ్చు పెట్టడానికి రాజకీయ కుట్ర దారుల పన్నాగం
- జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆడియో క్లిప్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామ్మోహన్ గౌడ్

ఎల్బీనగర్, జులై 13 (విజన్ ఆంధ్ర): ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి వ్యాఖ్యలపై ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో మంటలు చెలరెగుతున్నాయి. సీనియర్ నాయకురాలు ఈశ్వరమ్మ యాదవ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్మోహన్ గౌడ్ పై చేసిన వ్యాఖ్యలపై సోమవారం బీసీ సంఘాల నాయకులు భగ్గుమన్నారు. తాను గౌడ కులస్తులను తిట్టినట్లు... జక్కిడి ప్రభాకర్ రెడ్డి అన్నట్లు వచ్చిన ఆడియో క్లిప్ లపై రామ్మోహన్ గౌడ్ స్పందించారు. సోమవారం సాయంత్రం వనస్థలిపురం బి.యన్.రెడ్డి నగర్ లోని తన నివాసంలో సాయంత్రం విలేకరుల సమావేశంలో రామ్మోహన్ గౌడ్ మాట్లాడాతు.... తనకు రాజకీయంగా అండగా ఉన్న గౌడ కులస్తులను కించపరిచే విధంగా ఎలా మాట్లాడుతానని ప్రశ్నించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో విభజనలు తేవడానికి ప్రతిపక్ష పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. అసలు ఆ... ఆడియో క్లిప్ లను ఎక్కడి నుంచి పోస్టు చేస్తున్నారో అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తాను హైదరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ నుంచి తాను అన్ని కులాలు, మతాలను సమానంగా చూస్తానని తెలిపారు. జక్కిడి ప్రభాకర్ రెడ్డితో నాకు సన్నిహితంగా సంబంధాలు ఉన్నాయని, అలాంటి వ్యాఖ్యలు



చేస్తే తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. వెలుగులోకి వచ్చిన ఆడియో క్లిప్ లు నిజమేనని... ఏఐ టెక్నాలజీతో చేసిన ఆడియో క్లిప్ లు కావని రామ్మోహన్ గౌడ్ ధ్రువీకరించారు. రాజకీయంలో ఉన్నవారు అన్ని వర్గాలను సమానంగా చూడాలని సూచించారు. తనపై జరుగుతున్న కుట్రలను త్వరలో బయట పెడుతానని రామ్మోహన్ గౌడ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ నాయకుడు సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, బీసీ సంఘాల నేతలు, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కొండపాక దుద్దెడ లోని ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి ఎంత13 జూలై జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో కామన్ డైట్ మెనూపాటిస్తూరుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు పెట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులనుఆదేశించారు. సోమవారం కొండపాక మండలం దుద్దెడ గ్రామంలోని మరల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్నం భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఆలుగడ్డ టమాట వంకాయ కూర, వెజిటేబుల్ బిర్యాని, గుడ్డు లను పరిశీలిస్తూ వెజిటేబుల్ బిర్యాని నాణ్యత తనికి చేశారు. రోజు వారిగా విద్యార్థుల హాజరు ప్రకారం కూరగాయలు, వంట సరుకులు కొలత ప్రకారం తీసుకోవాలని, మధ్యాహ్నం భోజన ప్రక్రియను ప్రిన్సిపల్ లేదా ఒక ఉపాద్యాయులు పర్యవేక్షణ చెయ్యాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాఠశాల ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగాఉంచుకోవాలని ఎక్కడ కూడా నీటి నిలువలు ఉండకుండా, దోమలు ఈగలు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ మరియుఉపాధ్యాయులను ఆదేశించారు. కిచెన్ గార్డెన్ ను పరిశీలిస్తూ ఇంకా రకరకాల ఆకుకూరలు, పెట్టాలని రోజు వంటలో ఆకుకూరలు వాడేలా కిచెన్ గార్డెన్ ను అభివృద్ధి చెయ్యాలని ఆదేశించారు.

## ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం - ప్రజాదివాస్‌లో జిల్లా ఎస్పీ

భూపాలపల్లి జిల్లా :13 జులై (విజన్ ఆంధ్ర) భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 17 ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ గారు ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విని, వాటిపై వెంటనే స్పందించారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి మధ్యవర్తులు లేదా పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే



ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

వేములవాడ రాజన్న సిరిసిల్ల, జూలై 13 (విజన్ ఆంధ్ర బ్యూరో): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ సోమవారం దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ప్రభుత్వ విప్‌కు ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలు, స్వస్తివాచనంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆది శ్రీనివాస్‌కు అర్చకులు తీర్థప్రసాదం అందజేసి వేదాశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీమతి ఎల్. రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని ప్రభుత్వ విప్‌కు అందజేశారు. ఆలయ అధికారులు, అర్చకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వెర్షన్ మరింత వార్తా పత్రిక శైలి, సంక్షిప్తంగా మరియు ప్రొఫెషనల్‌గా ఉంటుంది.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## – జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 13,(విజన్ ఆంధ్ర)ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. సిర్పూర్ – టి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన మంగెన భూదేవి తనకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దహేగాం మండల కేంద్రానికి చెందిన భుతే దేవేందర్ తమ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణం పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేస్తారు. ఆసిఫాబాద్ మండలం కౌటగూడ గ్రామానికి చెందిన గెడం పద్మ తన భర్త మరణించినందున జాతీయ కుటుంబ ప్రయోజన పథకం క్రింద ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. సిర్పూర్ – టి మండల కేంద్రంలోని రైల్వే కాలనీకి చెందిన గాదె సుభద్ర తనకు గృహజ్యోతి పథకం క్రింద రాయితీ వర్తింపజేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామానికి చెందిన దుర్గం కావేరి తన పిల్లలకు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీకి చెందిన చాపిడి సరోజ తనకు మున్సిపాలిటీలోని మెప్మా విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ గా ఉపాధి కల్పించాలని కోరుతూ ఆర్ జి సమర్పించారు. దహేగాం మండలం ఐనం గ్రామానికి చెందిన కొట్లూరి దుర్గా గౌడ్ తాను సాగు చేస్తున్న ప్రభుత్వ భూమిని పట్టా చేసి పాసుపుస్తకం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుల్లో ఉత్సాహం

## – జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జులై 13( విజన్ ఆంధ్ర బ్యూరో)ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థులు చదువులో రాణిస్తారని, ఫలితంగా ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని గద్వాలలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి సాధన చేయాలన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.నులిపురుగుల నివారణకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి కేంద్రాల చిన్నారులతో పాటు విద్యాసంస్థల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థినిలు న్యూట్రీషన్ సమస్యలు లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలతో రక్తహీనతను నివారించవచ్చన్నారు. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వలన ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు అనంతరం కలెక్టర్ పలువురు విద్యార్థులకు మాత్రలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఇతర వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# కొండపాక మండలంలోని దుద్దెడ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు నులిపురుగుల మాత్రలను వేసిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి13 జూలై సిద్దిపేట జిల్లాలోనులిపురుగుల నివారణకు 1 నుండి 19 సంవత్సరాలలోపు పిల్లలందరికీ తప్పకుండా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు.సోమవారం కొండపాక మండలం దుద్దేడ గ్రామంలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగులు నిర్మూలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె హైమావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధనరాజ్, ఏం ఈ ఓ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్, వైద్యశాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఎదిగే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యం గా ఉండాలని ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుంది.తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. గోర్లు వారానికొకసారి కట్ చేసుకోవాలి. వేడి చేసిన మంచినీటిని తాగాలి. ఆహారం పైన ఈగలు వాలకుండా మూతలు పెట్టాలి. పండ్లను బాగా కడుక్కుని తినాలిభోజనం చేసేముందు మరుగుదొడ్లు వెళ్ళినప్పుడు చేతులు బాగా సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మీ ఇంటి చుట్టుపక్కల, పాఠశాలలో పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలిపిల్లలు ఎంత మంచి ఆహారం పెట్టిన కొంత మంది అనారోగ్యంగా ఉంటారని, ఇన్ని జాగ్రత్తలు పాటించిన ఏవైనా లోపలికి పోతే అనారోగ్య పాలు కాకుండా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహించి సంపూర్ణ ఆరోగ్యం గా తీర్చిదిద్దడానికి ప్రోత్సహిస్తుంది.నులిపురుగుల నివారణ దినోత్సవం గురించి పిల్లలు చాలా బాగా మాట్లాడారని వారిని అభినందించారు. అందరూ తప్పనిసరిగా ఈ అల్బండజోనల్ మాత్రలు వేసుకోవాలిమంచి అలవాట్లుఅలవర్చుకోవాలని, సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉంటేనే ఆటలు, చదువు చక్కగా ఉత్సాహంగా పాల్గొంటారనీ సూచించారు.“ ఆరోగ్యకరమైన శరీరంలో ఆరోగ్యకరమైన మనస్సు“ అనే సూక్తినీ ఎల్లపుడు గుర్తుచేసుకుంటూ, విద్య మరియు సంపూర్ణ అభివృద్ధికి మానసిక మరియు శారీరక శ్రేయస్సు రెండూ అవసరమని ఆయన విశ్వసించారు.

# ప్రజావాణిలో వచ్చిన109 ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి13 జూలై ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల వినతులను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి మొత్తం 109 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ నాగరాజమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఎస్డిసి సుదర్శన్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతికి నిర్దేశిత గడువులో పరిష్కారం చూపాలి

## వినతులపై నిరంతర పర్యవేక్షణతో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం బ్యూరో, జూలై 14(విజన్ ఆంధ్ర)ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి వినతిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక వసతులు, సామాజిక భద్రతతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన పలు సమస్యలను ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి, నిర్దేశిత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. తక్షణమే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, మిగిలిన వినతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం



ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని కేవలం నమోదు చేయడమే కాకుండా, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి ఫలితాలు కనిపించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో వ్యవహరిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు.ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరుగుతుందని పేర్కొన్నారు.

# ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చు

## ..జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 13, (విజన్ అంధ్ర)జిల్లాలో 19 సంవత్సరాల వయసు ఉన్న ప్రతి ఒక్కరూ ఆల్బెండజాల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 19 సంవత్సరాల లోపు పిల్లలు, యుక్త వయసు ఉన్న వారందరికీ నులిపురుగు నివారణ మాత్రలు అందించాలని, ఈ మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లలలో నులిపురుగులను నివారించవచ్చని, పోషణ మెరుగుపడుతుందని, ఆరోగ్యకర ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. తద్వారా పిల్లలు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై చదువుపై దృష్టి పెరుగుతుందని, మంచి భవిష్యత్తుకు సహాయపడుతుందని తెలిపారు. ఆల్బెండజోల్ కు మాత్రలు విద్యార్థులకు అందించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతిరోజు రుచికరంగా భోజనాన్ని అందించడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారంగా ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించాలని, పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

# చిన్నారుల ఆరోగ్య రక్షణకు నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరి

## నులిపురుగులు వద్దు – ఆరోగ్యం ముద్దు

### – పల్లె వెలుగు డాక్టర్ శృతి

నారాయణపేట, జూలై 13 (విజన్ ఆంధ్ర) ఒకటి నుంచి 13 ఏళ్ల వయసు గల చిన్నారులందరికి నూ లి పురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయించాలనిజాజాపూర్ పల్లె వెలుగు డాక్టర్ శృతి అన్నారు.నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామంలో ని సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా పాఠశాలలో 320 మంది విద్యార్థులకు ఆల్బండజోల్ టాబ్లెట్లు విద్యార్థులకు వేశారు. ఈ సందర్భంగా పల్లె వెలుగు డాక్టర్ శృతి మాట్లాడుతూ చిన్నారులపై నూలి పురుగులు తీవ్ర ప్రభావం చూపుతాయని ఇది కడుపులో చేరి పిల్లల్లో రక్తహీనత నీరసం పోషకాహార లోపం ఆకలి మందలించడం కడుపునొప్పి వికారం వాంతులు ఏర్పడి తీవ్రమైన అనారోగ్యానికి గురవుతారని అన్నారు. వీటి నివారణకు ఒక మాత్ర వేసుకుంటే పరిష్కారం లభిస్తుందని ఆల్బండజోల్ మాత్ర పిల్లల ఆరోగ్యవంతమైన జీవితానికి భరోసా ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వము జులై 13న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ పరిశుభ్రతను పాటించడం ద్వారా నులి పురుగుల నివారించే అవకాశం ఉ ందని, ముఖ్యంగా ప్రతి విద్యార్థి భోజనం చేసే ముందు కాళ్లు చేతులు



శుభ్రపరచుకోవాలని పరిశుభ్రమైన మరుగుదొడ్లను ఉపయోగించాలని, ప్రతిరోజు ఇండల్లో మరుగుదొడ్లను శుభ్రంగా చేసుకోవాలని కాళ్లకు చెప్పులు బూట్లు ఉపయోగించుకోవాలని, సురక్షితమైన పరిశుభ్రమైన నీరు మాత్రమే తాగాలని పూర్తిగా ఉడికిన ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలని అన్నారు. ఆహార పదార్థాలపై మూతలు ఉండేటట్లు తీసుకోవాలని, పరిశుభ్రమైన నీటితో కూరగాయలు పండ్లు కడిగిన తర్వాత వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అరుణ ఆశా వర్కర్లు జయమ్మ మంజుల అరుణ మరియు పాఠశాల సిబ్బంది భాను ప్రకాష్ లక్ష్మణ్ నిర్మల పాల్గొన్నారు.

# విద్యార్థులకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్లు, పతకాల ప్రదానం – జిల్లా కలెక్టర్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 13:(విజన్ ఆంధ్ర) జిల్లాలో తైక్వాండో మరియు కరాటే విభాగాల్లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు పతకాల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా సమావేశ మందిరంలో అవార్డులను విజేతలకు అందజేశారు.ఃసెంట్ క్లారిటీ స్కూల్‌కు చెందిన కె. నవనీత్ చంద్ర, ఫాతిమా కాన్వెంట్ విద్యార్థులతో పాటు కట్కూరి శ్రీనాథ్ మరియు కే. అశ్విత్ యాదవ్ లు కలెక్టర్ కే. హరిత చేతుల మీదుగా తమ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లను, మెడల్స్ ను అందుకున్నారు.ఃతైక్వాండో, కరాటే రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి, జిల్లా పేరును ప్రపంచ వేదికపై నిలిపినందుకు గాను వీరిని ప్రత్యేకంగా సత్కరించారు. విద్యార్థులు సాధించిన ఈ అద్భుతమైన విజయంపై డీ వై ఏస్ ఒ ఆశఫాక్ హైమద్ ఖేలో ఇండియ కోచ్ కడతాల రాకేష్ జిల్లా సెక్రటరీ ఎం. దేవయ్య ప్రెసిడెంట్ వి. రవి గారలు స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# నులిపురుగుల నివారణతోనే పిల్లల ఆరోగ్యానికి భరోసా

## ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు అందేలా చూడాలి

### జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ ప్రతినిధి జూన్ 13(విజన్ ఆంధ్ర)చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో నులిపురుగుల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల–2 లో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించి ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి తగ్గడం, కడుపునొప్పి, బరువు పెరగకపోవడం వంటి తీవ్ర సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. డీవార్మింగ్ (నులిపురుగుల




నివారణ) కార్యక్రమం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు శారీరక, మానసిక వికాసానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని తల్లిదండ్రులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ఆహారం తీసుకున్న తర్వాతే మాత్రలు ఇవ్వాలి: ఐవీసూజిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (ఐవీసూ) డా. ఎ. శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఒకటి నుంచి రెండు సంవత్సరాల లోపు పిల్లలకు అర మాత్రను పొడిచేసి నీటిలో కలిపి ఇవ్వాలని, రెండు సంవత్సరాలు పైబడిన వారికి 400 మిల్లీగ్రాముల పూర్తి మాత్రను నమిలి మింగేలా ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఖాళీ కడుపుతో మాత్రలు వేయకూడదని, ఆహారం తీసుకున్న తర్వాత మాత్రమే ఇవ్వాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో చదివే పిల్లలకు ఆయా విద్యాసంస్థల్లోనే మాత్రలు వేస్తారని, పాఠశాలలకు వెళ్లని చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశా కార్యకర్తల ద్వారా ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు.పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యంపిల్లల గోర్లను ఎప్పటికప్పుడు కత్తిరించడం, పరిశుభ్రమైన నీటిని మాత్రమే తాగించడం, పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి వినియోగించడం మరియు బహిరంగ మలవిసర్జన మానేసి మరుగుదొడ్లను మాత్రమే వినియోగించడం వంటి వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్ల ద్వారా నులిపురుగుల సమస్యను పూర్తిగా అరికట్టవచ్చని వైద్యాధికారులు ఈ సందర్భంగా వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. ఎన్. శైలజ, వైద్యాధికారులు డా. బి. శంకర్, డా. రాజు, డా. పులి విద్య, డా. నరేష్ చంద్ర, డా. ప్రవీణ్, మెడికల్ కళాశాలకు చెందిన డా. బిందు, మహాలక్ష్మి, హన్మంతు, నాగరాజు శెట్టి, భాస్కరాచారి, సుభాష్, సీతారామ్, ఆరోగ్య శాఖ సిబ్బంది మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్లు, పతకాల ప్రదానం – జిల్లా కలెక్టర్ కె హరిత

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 13: (విజన్ ఆంధ్ర) )జిల్లాలో తైక్వాండో మరియు కరాటే విభాగాల్లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు పతకాల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా సమావేశ మందిరంలో అవార్డులను విజేతలకు అందజేశారు.ః సెంట్ క్లారిటీ స్కూల్‌కు చెందిన కె. నవనీత్ చంద్ర, ఫాతిమా కాన్వెంట్ విద్యార్థులతో పాటు కట్కూరి శ్రీనాథ్ మరియు కే. అశ్విత్ యాదవ్ లు కలెక్టర్ కే. హరిత చేతుల మీదుగా తమ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లను, మెడల్స్ ను అందుకున్నారు.ఃతైక్వాండో, కరాటే రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి, జిల్లా పేరును ప్రపంచ వేదికపై నిలిపినందుకు గాను వీరిని ప్రత్యేకంగా సత్కరించారు. విద్యార్థులు సాధించిన ఈ అద్భుతమైన విజయంపై డీ వై ఏస్ ఒ ఆశఫాక్ హైమద్ ఖేలో ఇండియ కోచ్ కడతాల రాకేష్ జిల్లా సెక్రటరీ ఎం. దేవయ్య

ప్రెసిడెంట్ వి. రవి గారలు స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలి

ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను తప్పులు లేకుండా పూరించాలి

పూరించిన దరఖాస్తు ఫారాలను బిఎల్ఓ పట్లోళ్ళ పద్మశ్రీకి ఇవ్వాలి

2026 జూలై 20వ తేదీలోపు పూర్తి కావాలి

ద్యాచారం గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ అరుణ బస్వరాజ్, బిఎల్ఓ పట్లోళ్ళ పద్మశ్రీ



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 13 ( విజన్ ఆంధ్ర ) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ద్యాచారం గ్రామ సర్పంచ్ శట్లోళ్ళ అరుణ బస్వరాజ్, బిఎల్ఓ పట్లోళ్ళ పద్మశ్రీ సూచించారు. ఎస్ఐఆర్ మొత్తం దరఖాస్తు ఫారాలు 795 వంద శాతం ఓటర్లకు అందజేశారని వారు తెలిపారు. సోమవారం వికారాబాద్ మండల పరిధిలోగల ద్యాచారం గ్రామ సర్పంచ్, బిఎల్ఓ విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను పూరించడానికి కార్యదర్శి చింతలగట్టు వెంకటేశం, బిఎల్ఏలు దోమ వెంకటయ్య, క్షేత్ర పాలకుడు మహేందర్, కారోబార్ భీమేష్, విలేజ్ బుక్ కీపర్ బాపురం లాలయ్య సహకరిస్తున్నారని వారు పేర్కొన్నారు. 2002 ఓటరు జాబితాలో పేరు ఉన్న వ్యక్తి వివరాలను ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారంలో ఎడమవైపు అతని / ఆమె వివరాలు పూర్తి చేయాలని చెప్పారు. 2002 ఓటరు జాబితాలో పేరు లేకపోతే అతని / ఆమె తల్లి, తండ్రి, నాయనమ్మ / అమ్మమ్మ, తాతయ్యల ఎవరిదో ఒకరి పేరు రాసి వారి వివరాలతో పూరించాలని తెలిపారు. ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాన్ని నింపేముందు ఏవైనా అనుమానాలు ఉంటే వెంటనే బిఎల్ఓ పట్లోళ్ల పద్మశ్రీని సంప్రదించి నివృత్తి చేసుకోవాలని వారు సూచించారు. దరఖాస్తు ఫారాలను ఎట్టి పరిస్థితుల్లో తప్పులతో పూరించరాదని హితవు పలికారు. ఇప్పటివరకు 520 ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను ఆన్లైన్లో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని వారు స్పష్టం చేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులు 154

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 13 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణి కి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలులో నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను విన్నవించి పరిష్కరించేందుకు 154 మంది ఫిర్యాదు చేశారు. ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమస్యలను పెండింగ్ ఉంచకుండా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని ప్రతి వినతిని పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్,డి ఆర్ ఓ స్వర్ణ లత, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శభాష్ పోలీసన్న

–ట్రాఫిక్ పోలీసుల సమయస్ఫూర్తి

– వాహనదారుల హర్షం




విజన్ ఆంధ్ర(13) హైదరాబాద్సోమాజిగూడ ప్రెస్ క్లబ్ సమీపంలోని ప్రధాన రహదారిపై సోమవారం ఓ ఆర్టీసీ బస్సు సాంకేతిక లోపంతో ఒక్కసారిగా నిలిచి పోయింది, దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ సమస్య తలెత్తే పరిస్థితి నెలకొంది, అక్కడే విధులు నిర్వహిస్తున్న హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వెంటనే అప్రమత్తమై చర్యలు చేపట్టారు, ట్రాఫిక్ సిబ్బంది తలా ఒక చెయ్యి వేస్తూ. బస్సును రహదారి పక్కకు తొలగించి, వాహనాల రాకపోకలను క్రమ బద్ధీకరించారు, దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా పరిస్థితిని చాకచక్యంగా అదుపులోకి తీసుకొచ్చారు, విధి నిర్వహణలో నిమగ్నమైన ట్రాఫిక్ పోలీసుల సేవాభావాన్ని చూసిన వాహనదారులు అభినందనలు తెలిపారు, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే స్పందించిన పోలీసుల సమయ స్ఫూర్తిపై ప్రశంసలు కురిపించారు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల పనితీరు మరోసారి అందరి మన్ననలు పొందింది

## నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,ఐపీఎస్.



భూపాలపల్లి జిల్లా :13 జులై ( విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలని సూచించారు. సి.సి.టి.ఎన్.ఎస్. (2.0)లో ప్రతి కేసును సకాలంలో నమోదు చేసి, వివరాలను నిరంతరం అప్డేట్ చేయాలని తెలిపారు. వ్యవస్థలో అందుబాటులో ఉన్న అన్ని ఫీచర్లను సమర్థవంతంగా వినియోగించి పారదర్శకత, సమాచార సమన్వయం మరియు సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, గ్రామ స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే గంజాయి రవాణా, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ స్థాయి పోలీసింగ్ను మరింత బలోపేతం చేస్తూ, విలేజ్ పోలీస్ అధికారులు ప్రజలతో మమేకమై ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## మూడు రోజుల జిల్లా స్థాయి సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం ప్రారంభం - జిల్లా కలెక్టర్




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై.13: (విజన్ ఆంధ్ర )కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల రిసోర్స్ పర్సన్స్ (వీ్రాం) కోసం నిర్వహిస్తున్న మూడు రోజుల జిల్లా స్థాయి సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం సోమవారం జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల, ఆసిఫాబాద్లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. హారిత, ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాథమిక ఉపాధ్యాయులే విద్యా వ్యవస్థకు మూలస్తంభాలు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ప్రాథమిక విద్య. ప్రతి చిన్నారిలో చదవడం, రాయడం, గణించడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించే గొప్ప బాధ్యత ప్రాథమిక ఉపాధ్యాయులపై ఉంది. ఈ శిక్షణలో నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రతి విద్యార్థి అభ్యసన ఫలితాలను మెరుగుపర్చేందుకు కృషి చేయాలని,ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులకు వినూత్న బోధనా పద్ధతులు, సమగ్ర బోధన, విద్యార్థి కేంద్రిత అభ్యాసం, అభ్యసన ఫలితాల మెరుగుదల వంటి అంశాలపై చర్చ జరగాలని, ఎం ఆర్ పి లకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమం జూలై 13 నుండి 15 వరకు కొనసాగనుండగా, జిల్లాలోని అన్ని మండలాల నుండి ఎంపికైన మండల రిసోర్స్ పర్సన్స్ (వీ్రాం) పాల్గొంటున్నారు. ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, బోధనను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడం, విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యంగా జులై 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీ సచ్చిదానంద చారి,క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీ ఉప్పులేటి శ్రీనివాస్,కోర్స్ ఇన్చార్జి శ్రీ అడే ప్రకాష్ , జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్లు, అన్ని మండలాల నుండి ఎంపికైన మండల రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

## నత్తనడకన గోదుమవాగు వంతెన మరమ్మతులు

15 రోజులు గడిచినా పూర్తి కాని పనులు

వన్వేతో నిత్యం ట్రాఫిక్ కష్టాలు.

ప్రమాదాల భయంతో ప్రయాణం

అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం



కొత్తగూడెం బ్యూరో, జూలై 15 (విజన్ ఆంధ్ర):రామవరంకొత్తగూడెం ప్రధాన రహదారిలోని గోదుమవాగు వంతెనపై చేపట్టిన మరమ్మతు పనులు తీవ్ర జాప్యంతో సాగుతుండటంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వంతెనపై ఏర్పడిన ప్రమాదకర గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో అధికారులు దాదాపు 15 రోజుల క్రితం మరమ్మతు పనులు ప్రారంభించినప్పటికీ, ఇప్పటికీ అవి పూర్తికాకపోవడంతో వేలాది మంది ప్రయాణికులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో ప్రతిరోజూ ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు, బొగ్గు లారీలు, స్కూల్ బస్సులు, అంబులెన్సులు, ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ఇంత కీలకమైన రహదారిపై పనులు నత్తనడకన సాగడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతు పనుల కారణంగా ప్రస్తుతం వంతెనపై వన్వే విధానంలో మాత్రమే వాహనాలను అనుమతిస్తున్నారు. వంతెనపై పనులు నెమ్మదిగా సాగుతుండటంతో వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో తగిన హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, లైటింగ్ లేకపోవడం వల్ల ప్రమాదాలకు అవకాశం పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ద్విచక్ర వాహనాలు అదుపు తప్పిన ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొంటున్నారు. ప్రమాదకర గుంతలపై విజన్ ఆంధ్ర కథనం వెలువడిన అనంతరం అధికారులు స్పందించి మరమ్మతు పనులు ప్రారంభించినప్పటికీ, పనుల్లో వేగం కనిపించకపోవడం పట్ల ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యను గుర్తించిన తర్వాత కూడా పనులను త్వరితగతిన పూర్తి చేయడంలో సంబంధిత శాఖ విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజూ వేలాది మంది రాకపోకలు సాగించే ఈ ప్రధాన రహదారిపై పనులు ఇంతకాలం కొనసాగడం వల్ల ప్రజల సమయం, ఇంధనం వృథా అవుతోందని, ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని స్థానికులు అంటున్నారు. కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేసేలా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అదనపు సిబ్బంది, యంత్రాలను వినియోగించి యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు పూర్తి చేసి, ద్విముఖ రాకపోకలను పునరుద్ధరించాలని ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

## పులుమద్దిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

2031 దరఖాస్తు ఫారాలలో 1300 ఆన్లైన్ అప్లోడ్ పూర్తి


బిఎల్ఓలు నల్ల కవిత, సిహెచ్ రేణుక, బిఎల్ఏలు కనకాచారి, క్షేత్ర పాలకుడు గొల్ల కిష్టయ్య

గ్రామ సర్పంచ్ బోయిని శ్వేత శివయ్య ముదిరాజ్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 13 (విజన్ ఆంధ్ర) : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ఐఆర్ ) ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నదని పులుమద్ది గ్రామ సర్పంచ్ బోయిని శ్వేత శివయ్య ముదిరాజ్ అన్నారు. 2031 ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను ఓటర్లకు 100 శాతం అందజేశామని ఆమె తెలిపారు. సోమవారం వికారాబాద్ మండల పరిధిలో గల పులుమద్ది గ్రామంలో ప్రత్యేక సమగ్ర సమీక్ష ప్రక్రియ పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆమె విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను బిఎల్ఓ లు బిఎల్ఓలు నల్ల కవిత, సిహెచ్ రేణుకతో పాటు బిఎల్ఏలు కనకాచారి, క్షేత్ర పాలకుడు గొల్ల కిష్టయ్య సహకరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. 2031 ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలలో ఇప్పటివరకు 1300 మంది ఫారాలను ఆన్లైన్లో అప్లోడ్ చేయనైనదని ఆమె స్పష్టం చేశారు. నిర్దేశిత కాల పరిమితిలో అన్ని ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను ఆన్లైన్లో అప్లోడ్ చేస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

## సర్ లో డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి



దుబ్బాక విజన్ ఆంధ్రా రిపోర్టర్ :కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (సర్)లో ఎన్యూమరేషన్ ఫారాల సేకరణతో పాటు వాటి ఆన్లైన్ డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని దుబ్బాక నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) విజయలక్ష్మి తెలిపారు. సోమవారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో తహసిల్దార్ మోతి సింగ్ ఆధ్వర్యంలో సర్ ప్రక్రియపై రెవెన్యూ సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలోని 253 పోలింగ్ స్టేషన్ల పరిధిలో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియకు సంబంధించి సోమవారం సాయంత్రం వరకు 67% ఎన్యుమరేషన్ పత్రాల డిజిటల్లైజేషన్ ప్రక్రియ పూర్తయినట్టు తెలిపారు. నియోజకవర్గంలో సర్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ అత్యధికంగా రాయపోల్ మండలంలో ఇప్పటివరకు 77% పూర్తికాగా, చివరి స్థానంలో చేగుంట 55% పూర్తయిందన్నారు. సర్ ప్రక్రియలో భాగంగా అందజేసిన ఎన్యుమరేషన్ పత్రాలను పూరించి, బిఎల్ఓలకు తిరిగి ఇవ్వకపోతే ఓటు హక్కు కోల్పోతారన్నారు. ఓటరు ఒకచోట మాత్రమే ఓటు హక్కును కలిగి ఉండే విధంగా దరఖాస్తు ఇవ్వాలని, రెండు చోట్ల ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చి రెండు ఓట్లు పొందితే, ఒక సంవత్సరం జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. ఈనెల 20వ తేదీలోపే ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ మోహన్ రెడ్డి, దుబ్బాక జిపిఓ రవీందర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా, నిబంధనల మేరకు పూర్తి చేయాలి

– జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం బ్యూరో జూలై 15(విజన్ ఆంధ్ర)కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) హెల్ప్డెస్క్ను పరిశీలించారు. కొత్తగూడెం పరిధిలోని 66 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నారా, ఓటర్లు నింపిన ఫారాలను తిరిగి స్వీకరిస్తున్నారా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. బీఎల్వోలు సేకరించిన ఫారాలను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను ఆపరేటర్లు అత్యంత అప్రమత్తంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. డిజిటలైజేషన్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఓటర్లకు ఫారాలు పూరించే విధానంపై అవగాహన కల్పిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ఇంటి వద్ద అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించి వారికి ఫారాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బీఎల్వోలు తమకు కేటాయించిన పరిధిలో అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సంబంధిత బీఎల్వో సూపర్వైజర్లకు వెంటనే తెలియజేసి, ఫారాల పంపిణీ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పుల్లయ్య మాట్లాడుతూ, కొత్తగూడెం పరిధిలో 66 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటి పర్యవేక్షణకు ఏడుగురు బీఎల్వో సూపర్వైజర్లు విధులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్కు వివరించారు.

## బ్రేక్ఫాస్ట్ డ్రైవ్లో గో-కార్ట్ రేసింగ్ నిర్వహించిన స్పిన్నీ



హైదరాబాద్, జూలై 13 (విజన్ ఆంధ్ర) : డ్రైవింగ్ పట్ల అభిరుచి ఉన్న వారిని ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా స్పిన్నీ బ్రేక్ఫాస్ట్ డ్రైవ్లో గో–కార్ట్ రేసింగ్ నిర్వహించినట్లు స్పిన్నీ తెలంగాణ క్లస్టర్ హెడ్ మిస్టర్ బిశ్వజిత్ బోస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని ఫీనిక్స్ ట్రివియాలో ఉన్న స్పిన్నీ కార్ హబ్ నుంచి ప్రారంభమైన స్పిన్నీ బ్రేక్ఫాస్ట్ డ్రైవ్, నానక్రామ్గూడ సమీపంలోని ఎఫ్ఎన్ఎఫ్ అరేనా గో–కార్టింగ్ వద్ద గో–కార్ట్ రేసింగ్తో పాల్గొన్న వారిని ఆశ్చర్య పరిచిందని తెలిపారు. ఈ అనుభవాన్ని కస్టమర్లు తుకారాం, సంతోష్ కుమార్, మధు ప్రశంసించారని పేర్కొన్నారు. హైదరాబాద్లో స్పిన్నీ నాలుగు కార్ హబ్లు, విశాఖపట్నంలో ఒక స్పిన్నీ పార్క్ ద్వారా సేవలు అందిస్తోందని తెలిపారు. దేశ వ్యాప్తంగా 57కు పైగా కార్ హబ్లు, 76 నగరాల్లో కార్యకలాపాలతో ప్రతి నెల 10 వేలకుపైగా కార్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు.

## చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలు వేయించాలి

– జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 13 ( విజన్ ఆంధ్ర ) : చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని సంఘం లక్ష్మీబాయి బాలికల జూనియర్ కళాశాలలో చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని విద్యార్థినీలకు మాత్రల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి ఏడాదిలో రెండుసార్లు ప్రభుత్వం ఉచితంగా ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేస్తుందన్నారు. నులి పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని ఆల్బెండాజోల్ మాత్రలు వేయడం వల్ల నులి పురుగులను సమర్థవంతంగా నివారించడంతో పాటు పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల మెరుగుపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సుధాకర్ లాల్, కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రాణ స్నేహితుడు శారీరకంగా దూరమైన భౌతికంగా మాతోనే ఉన్నాడు

### కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా నాయకులు ఎస్ ఎస్ సాజిద్



సూర్యాపేట జూలై 13:(విజన్ ఆంధ్ర)హైకోర్టు న్యాయవాది పూసర్ల రజనీకాంత్ శారీరకంగా దూరమైన భౌతికంగా మా మధ్యలోనే ఉన్నాడని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ జిల్లా నాయకులు ఎస్ ఎస్ సాజిద్ అన్నారు. సోమవారంహైకోర్టు న్యాయవాది పూసర్ల రజనీకాంత్ 19వ వర్ధంతిని పురస్కరించుకుని ఎస్ ఎస్ సాజిద్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు లో సోమవారం 55 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణ స్నేహితుడు జ్ఞాపకాలు నా మదిలో ఎప్పుడు పదిలంగా ఉన్నాయని ఆయనను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు.తన ఆత్మీయ స్నేహితుడు రజినీకాంత్ చిత్రపటానికి సాజిద్ ఖాన్‌తో పాటు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజినీకాంత్‌తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన జ్ఞాపకార్థం ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆకాంక్షించారు.

## ఎర్రవల్లిలో ప్రత్యేక సమగ్ర సమీక్ష ప్రక్రియ

### 1012 ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలు లో 560 ఆన్లైన్లో అప్లోడ్ పూర్తి

### బిఎల్ఓ సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ సయ్యద్ రబ్బాని



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 13 ( విజన్ ఆంధ్ర ) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సమీక్ష ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నదని ఎర్రవల్లి గ్రామ సర్పంచ్ సయ్యద్ రబ్బాని బిఎల్ఓ సత్యనారాయణ అన్నారు. గ్రామంలో 1012 ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను ఓటర్లకు 100% అందజేశామని తెలిపారు. సోమవారం వికారాబాద్ మండల పరిధిలోగల ఎర్రవల్లి గ్రామంలో విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. నేటి వరకు 560 దరఖాస్తు ఫారాలను ఆన్లైన్లో అప్లోడ్ ప్రక్రియ పూర్తయిందని వారు తెలిపారు. బిఎల్ఓ కు బిఎల్ఏలు ఆశా వర్కర్ అనిత క్షేత్రపాలకుడు కే లక్ష్మయ్య అంగన్వాడి టీచర్ శోభ వార్డు మెంబర్ స్వాతి ఏ డబ్ల్యూహెచ్ శారద విలేజ్ బుక్ కీపర్ ఉమారాణి సహకరిస్తున్నారని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో పేరు ఉంటే ఎఫ్ఐఆర్ దరఖాస్తు ఫారంలో ఎడమవైపు ఓటర్ వివరాలు పూరించాలని వారు పేర్కొన్నారు. 2002 ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఓటర్ యొక్క తల్లి, తండ్రి, నాయనమ్మ / అమ్మమ్మ, తాతయ్యల ఎవరిదో ఒకరి పేరు రాసి వారి వివరాలు రాయాలని సూచించారు. కింది భాగంలో ఓటర్ వివరాలు పూరించాలని వారు స్పష్టం చేశారు.

### వాయిస్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక వాయిస్ క్లినిక్



హైదరాబాద్, జూలై 12 (విజన్ ఆంధ్ర): కాంటినెంటల్ హాస్పిటల్స్‌లో గాయకులు, కళాకారులు, ఉపాధ్యాయులు, బ్రాడ్‌కాస్టర్లు తదితర వాయిస్ ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక 'కాంటినెంటల్ వాయిస్, పెర్ఫార్మెన్స్ క్లినిక్'ను ఆస్కార్ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ ఎం.ఎం.కీరవాణి, కాంటినెంటల్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ డా.గురు ఎన్.రెడ్డి, పద్మశ్రీ శోభా రాజు సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.గురు ఎన్.రెడ్డి వాయిస్ శిక్షణ, స్పీచ్ థెరపీ ప్రాధాన్యాన్ని వివరించగా, కీరవాణి వాయిస్ సంరక్షణ కోసం ఇటువంటి ప్రత్యేక కేంద్రాల అవసరాన్ని కొనియాడారు. అనంతరం ఈఎన్‌టీ, లారింజాలజీ విభాగం ఆధ్వర్యంలో 70 మందికి పైగా ఔత్సాహిక గాయకులు, వాయిస్ ప్రొఫెషనల్స్‌కు వర్క్‌షాప్ నిర్వహించారు. డా.దుష్యంత్ గణేశుని, డా.రేష్మి అన్నా అలెక్స్ వాయిస్ హైజీన్, మాడ్యులేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

### టీజీ-20 విజేతలకు గ్రావ్టన్ క్వాంటా ఈ-బైక్‌లు

హైదరాబాద్, జూలై 13 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ యువ క్రికెటర్ల ప్రతిభను ప్రోత్సహించడం గర్వకారణమని గ్రావ్టన్ మోటార్స్ సీఈఓ పర్శురామ్ పాకా అన్నారు. ఇటీవల శ్రీనిధి యూనివర్సిటీ టీజీ-20 టోర్నమెంట్ ముగింపు సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన గ్రావ్టన్ మోటార్స్ నాలుగు గ్రావ్టన్ క్వాంటా ఎలక్ట్రిక్ ఈ-బైక్‌లను అత్యుత్తమ ఆటగాళ్లకు బహుమతిగా అందజేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో అన్విత ఖమ్మం ఏసెస్‌కు చెందిన వేద్ రెడ్డి అమిస్తాపురం(ఎమర్జింగ్ ప్లేయర్), మిక్కిల్ జైస్వాల్(బెస్ట్ క్యాచ్), కరీంనగర్ డైమండ్స్ ఆటగాడు తన్మయ్ అగర్వాల్ (పవర్ ప్లేయర్), హైదరాబాద్ ఈ-చాంపియన్స్‌కు చెందిన గణేష్ గడుగు(ప్రామిసింగ్ డిస్ట్రిక్ట్ ప్లేయర్) ఒక్కొక్కరు గ్రావ్టన్ క్వాంటా ఈ-బైక్‌ను అందుకున్నట్లు చెప్పారు.

# గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాడుదాం..!

### జర్నలిస్టులపై రాజకీయాలు చేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్.

### మీడియాపై ఇలాంటి వివక్ష ఎప్పుడు చూడలేదు..

### ముఖ్యమంత్రిని బదునాం చేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

### టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య..

### ఈ సుద్దపూసల బండారం బయటపెట్టాలి - జర్నలిస్ట్ కేపీ

### గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేని ప్రభుత్వాలు సిగ్గుపడాలి - జిల్లా అధ్యక్షుడు గణేష్.

### రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు "టిడబ్ల్యూజెఎఫ్" జర్నలిస్టుల ఆందోళన

### కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన జర్నలిస్టులు




రంగారెడ్డి బ్యూరో, జూలై 13(విజన్ ఆంధ్ర):సమాజంలో ఉన్న సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉన్నాం.. ఇప్పుడు పోరాడే జర్నలిస్టులే సమస్యల్లో పడ్డారు.. అయినా వదిలి పెట్టేది లేదు.. మనకోసం మనమే పోరాడుదాం.. గల్లి నుంచి ఢిల్లీ దాకా మన పోరాటాన్ని కొనసాగిద్దాం.. అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు సోమవారం జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు అక్కడికి చేరుకొని కార్యాలయ గేటు ముందు ఆందోళన నిర్వహించారు. టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లాకు అధ్యక్షుడు శేరీబాయి గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు దేవేందర్, ఎండి ఖాజాపాషా కేపి, శ్రీనివాసచారి, చంద్రశేఖర్, మన్సూర్ అలీ ఖాన్, శ్రీశైలం, నరసింహారెడ్డి, రాజశేఖర్ తదితరులతో పాటు షాద్ నగర్, ఇబ్రహీంపట్నం, అమన్ గల్, శంషాబాద్, చేవెళ్ల, శంకర్ పల్లి, షాబాద్, కడ్తాల్, తలకొండపల్లి, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, గండిపేట్ తదితర ప్రాంతాల నుండి జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా అక్రిడేషన్ కార్డు ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు తదితర విషయాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య మాట్లాడుతూ.. చిన్న సమస్యల కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితి జర్నలిస్టులకు ఏర్పడుతుందని, ఇది అత్యంత దారుణమని అన్నారు. ఇదంతా ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆడిస్తున్న నాటకం అని, దీనిపై ప్రశ్నించడానికి వెళితే కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ తీరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బదనాం చేస్తుందని ఆరోపించారు. ఎలాంటి సమస్యలనైనా తమ వార్తల ద్వారా తెలియజేసే జర్నలిస్టులు చిన్న సమస్యల కోసం పోరాడాల్సిన దుస్థితి ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఎదుర్కొంటున్నామని అన్నారు. 40 ఏండ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ రైల్వే పాసు సమస్యలపై కేంద్ర ప్రభుత్వంతో పోరాడేందుకు త్వరలో జర్నలిస్టులు ఢిల్లీ వెళ్లాల్సి ఉందని తెలిపారు.ఇక్కడ గల్లి అయిన అక్కడ ఢిల్లీ అయినా టిడబ్ల్యూజేఎఫ్ ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కొన్ని జర్నలిస్టు యూనియన్లు రాజకీయ పార్టీలలా వ్యవహరిస్తూ జర్నలిజంలో రాజకీయాలు తెచ్చి విభజించి పాలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రిని, మంత్రి పొంగులేటిని కలిసి మాట్లాడటం జరిగిందన్నారు. జర్నలిస్టులకు రైలు, మెట్రో రైలులో కూడా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశామని తెలిపారు. అలాగే విద్య, వైద్యం విషయంలో సహకారం అందించాలని కోరారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు గుర్తింపు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలన్నారు.తీగ లాగుతాం.. డొంక కదిలిస్తాంటిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేపీకొంతమంది అధికారులు అంతా రూల్స్ ప్రకారమే వెళుతున్నామని బిల్డప్పులు ఇస్తున్నారు.. కానీ చదువురాని వాళ్లకు కూడా గుర్తింపు కార్డులు జారీ చేశారనీ, కానీ దశాబ్దాలుగా జర్నలిస్టులుగా పని చేస్తున్న వారిని మాత్రం పక్కన పెట్టారన్నారు. దీనిని వదిలిపెట్టేది లేదు.. తీగలాగితే డొంక కదిలిస్తాం.. అని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జర్నలిస్ట్ కేపీ అన్నారు. జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాలపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అక్రిడేషన్ గుర్తింపు కార్డుల విషయంలో ఇంత దారుణాన్ని ఇప్పటిదాకా చూడలేదని, జర్నలిస్టులను పనిగట్టుకొని కొందరు వెంటాడుతూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత లేని వారికి ఎంతమందికి అక్రిడేషన్ కార్డులు ఇచ్చారు ఆ జాబితా తమ వద్ద ఉన్నాయని త్వరలోనే అక్రిడేషన్ ప్రక్రియ పూర్తయ్యాక అన్ని వివరాలు బయటపెడతామని హెచ్చరించారు. దీనిపై కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సుద్దపూసల వ్యవహరిస్తున్న అధికారుల బండారాన్ని త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. నిరంతరం వార్తల ద్వారా ప్రజల్లో ఉండి సేవలు అందిస్తూ, నాయకులకు ప్రచారం కల్పించే జర్నలిస్టుల పట్ల ఇలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. చాలామంది జర్నలిస్టులను కార్డులు ఇవ్వకుండా వేధిస్తున్న ఈ తీరుపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కనీస అవగాహన లేని, అక్షరం ముక్క రాయలేని జర్నలిస్టులకు కార్డులు ఇచ్చారు.. ఇంగ్లీషు రాయడం చేతకాని జర్నలిస్టులకు ఆంగ్ల పత్రికల్లో కార్డులు ఇచ్చారు.. ఫీల్డ్ కు సంబంధం లేని వారికి కూడా కార్డులు ఇచ్చారని, కానీ దశాబ్దాలుగా అంకితభావంతో సేవలు అందిస్తున్న జర్నలిస్టులను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోరాడి హక్కులను సాధించుకుంటామని ఈ సందర్భంగా వెల్లడించారు.జర్నలిస్టును గుర్తించలేని ప్రభుత్వం సిగ్గుపడాలిటియుడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు గణేష్సమాజానికి సేవలు అందిస్తున్న జర్నలిస్టులను గుర్తించలేని ప్రభుత్వం సిగ్గుపడాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గణేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డుల ప్రక్రియలో పూర్తిస్థాయిలో పక్షపాత ధోరణి కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. దీనిపై ప్రజాస్వామ్య యుతంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను చూసి వారి తరఫున ప్రచారం చేసి గెలిపిస్తే గెలిచాక జర్నలిస్టులను పూర్తిగా పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం, వైద్య సదుపాయం కల్పించడం, జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య లక్ష్యంగా ఈ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. సూర్య దినపత్రికను అదేవిధంగా మరికొన్ని దినపత్రికలను కక్షపూరిత ధోరణిలో పక్కన పెట్టారని ఇదంతా యూనియన్ల రాజకీయమని అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రభుత్వం అప్రతిష్ట పాలవుతుందని ఎల్లప్పుడూ ప్రెస్ అకాడమీ చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డి ఉండడని అవకాశం మాకు కూడా వచ్చినప్పుడు తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. ఇంతకు మునుపు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు అన్నారు. హైదరాబాదులో ఈ నెల 15వ తేదీన జరిగే ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రాంతాల జర్నలిస్టులు రఘు, నరేష్, గోపాల్, బుచ్చన్న, యాదగిరి, జగన్, నరసింహ, సురేంద్ర, శంకర్, కస్తూరి రంగనాథ్, ఎలక్ట్రానిక్ మీడియా షాద్ నగర్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయినాథ్ రెడ్డి, సాయినాథ్ రెడ్డి, రాకేష్, కృష్ణ, ధరశీపాల్, శివ కుమార్, నరేందర్ గౌడ్, రామకృష్ణ, శ్రీకాంత్, ఆవుల రమేష్, శంకర్, చంద్రశేఖర్ గౌడ్, షకీల్, రియాజ్, ఖాలేద్ శ్యామ్ కుమార్, బూర్గుల రమేష్, మంచలం రమేష్, బండి గోపాల్, సత్యనారాయణ, రవి, రాజు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు..

# మహిళా భద్రతకు పోలీస్ అక్క

### మహిళలకు, బాలికలకు భద్రత కల్పించడమే లక్ష్యం

### సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ



సూర్యాపేట జూలై 13:(విజన్ ఆంధ్ర)తెలంగాణ పోలీసు వినూత్నంగా చేపట్టిన పోలీసు అక్క అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం నందు ఎస్పి నరసింహ అధ్వర్యంలో మహిళా పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి పోలీసు అక్క కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమం నందు అన్ని పోలీసు స్టేషన్ ల నుండి పోలీస్ అక్క లు హాజరైనారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధ్వర్యంలో డిజిపి మహిళల, బాలికల, విద్యార్థినుల రక్షణ కోసం పోలీస్ అక్క అనే విశిష్టమైన, వినూత్నమైన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగినది. సమాజంలో మహిళలకు, పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు దైర్యం కల్పించడం, పోలీసు స్టేషన్ కు వచ్చే మహిళా పిర్యాదుదారులకు, బాధితులకు భరోసా కల్పించడం, స్నేహపూర్వక వాతావరణంలో వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేయడం ఈ పోలీస్ అక్క కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. మహిళలు, విద్యార్థినులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా లేదా భయపడకుండా తమ సమస్యలను ఒక సొంత అక్కతో పంచుకున్నట్లు పోలీసులతో పంచుకునేలా చేయడం అన్నారు.మన సమాజంలో మహిళల, విద్యార్థినుల రక్షణలో, భద్రతలో ఎన్నో మార్పులు, ఎన్నో చట్టాలు ఆదునికరించబడ్డాయి, కొత్త చట్టాలు వచ్చాయి, షీ టీం, బరోసా సెంటర్, సఖీ సెంటర్, ఇలా అనేక రక్షణ విభాగాలు వచ్చాయి, సతీసహగమనం లాంటి పరిస్థితుల నుండి శాస్త్ర సాంకేతిక అవిష్కరణలు చేయడం, చట్టాలను, ప్రభుత్వ పాలనను నడిపించే స్థాయికి మహిళలు ఏదిగారు అన్నారు. మహిళలకు హక్కులను సాధించడంలో ఎందరో మహానుభావులు కృషి చేసినారు.ఇలాంటి సమాజంలో ఇప్పుడు మహిళల, విద్యార్థినుల రక్షణ పోలీసు అక్క బాధ్యత అన్నారు. మహిళల, విద్యార్థినుల రక్షణలో పోలీసు అక్క పటిష్టంగా పని చేయాలని అన్నారు. పోలీసు స్టేషన్ కు వచ్చే బాధితులకు భద్రత, భరోసా కల్పించడం తో పాటుగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బాలికల విద్యాలయాలను, కాలనీలోని మహిళా సంఘాలను సందర్శించి మహిళల రక్షణ చట్టాల గురించి, షీ టీం, బరోసా పోలీస్, పోక్సో చట్టాల గురించి అవగాహన కల్పించాలి అన్నారు. నెలలో ఒక రోజు బాలికల హాస్టల్స్ నందు నిద్రించి స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలి అన్నారు. పోలీస్ యూనిఫాం ధరించి పోలీస్ అక్క ఆదర్శంగా ఉండాలని కోరారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళా కానిస్టేబుల్‌ను "పోలీస్ అక్క"గా నియమించాం అన్నారు. దీని ద్వారా ఆకతాయిల వేధింపులు, ర్యాగింగ్ మరియు బాల్య వివాహాల వంటి సామాజిక అరిష్టాల నివారణకు ఇది ఎంతో తోడ్పడుతుంది. బాధితుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతూ చట్టపరమైన చర్యలు మరియు కౌన్సెలింగ్ అందిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులలో ఆత్మస్థైర్యం పెరిగి, తమకు ఏ సమస్య ఎదురైనా తక్షణమే స్పందించే ధైర్యం కల్గుతుంది అన్నారు. సమస్యలు, వేదింపులు ఉంటే డయల్.100, 112 లను సంప్రదించి పోలీసు సేవలు పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, మహిళా ఎస్ఐ లు మౌనిక, నీలిమ, జాన్సీ రాణి, ఏఎస్ఐ లు సైదాని, అరుణా దేవి, కవిత, మహిళా సూపరింటెండెంట్ సబితా రాణీ, శ్రీదేవి, అన్ని పోలీస్ స్టేషన్ ల పోలీసు అక్కలు పాల్గొన్నారు.

## తల్లి స్థాయి ఉన్న ఈశ్వరమ్మపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు




సూర్యాపేట టౌన్, జూలై 13:(విజన్ ఆంధ్ర)యాదాద్రి టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ డైరెక్టర్ల ఒకరిగా ఎన్నికైన ఈశ్వరమ్మ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు శివ చరణ్ రెడ్డి నీ కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని శ్రీకృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్ ప్రముఖ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లి సమాన స్థాయి ఉన్న ఈశ్వరమ్మ విచక్షణారహితంగా వ్యక్తిగత విమర్శలు చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఒకరిద్దరు అగ్ర కులాల వ్యక్తుల మూలంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో చులకన అయ్యే అవకాశం ఉందన్నారు. రెడ్డి సామాజిక వర్గం సైతం తలదించుకునేలా శివ చరణ్ రెడ్డి మాట్లాడాలని ఆరోపించారు. యాదవులు ఎప్పుడు సమాజంలో సామాజిక న్యాయం పాటించే విధంగా ప్రవర్తిస్తారని ఎక్కడ తక్కువ స్థాయి విమర్శలు చేయలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల పాత్ర కీలక మన్నారు. శివ చరణ్ రెడ్డి నా వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కుల అహంకారంతో మాట్లాడిన శివశరణ్ ఈశ్వరమ్మకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మర్యాద సైదులు యాదవ్, ప్రధాన కార్యదర్శి తూము వెంకట యాదవ్, మాజీ పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు యాదవ్, ఉపాధ్యాయుల సంఘం సభ్యులు రాము యాదవ్, మాజీ ఎంపీపీ బడుగు శ్రీనివాస్ యాదవ్, కోడి లింగయ్య యాదవ్, మేకల శ్రీనివాస్ యాదవ్, గుండెబోయిన రమేష్ యాదవ్, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు బుడియా మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు వేల్పుల లింగయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి బిక్షపతి యాదవ్, వెంకట్ యాదవ్, దాసరి వెంకన్న యాదవ్, బడుగు సైదులు యాదవ్, వేల్పుల ఆరాల రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

## సిబ్బంది కుటుంబాలకు బాసటగా పోలీసు భద్రత స్కీమ్

### కుటుంబాల సంక్షేమానాకి భరోసా

### సూర్యాపేట జిల్లా ఎస్పి కె. నరసింహ



సూర్యాపేట జూలై 13:(విజన్ ఆంధ్ర)సూర్యాపేట జిల్లా నాగారం పోలీస్ స్టేషన్ నందు కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కమలాకర్ ఆకాలంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మరణించిన కానిస్టేబుల్ కమలాకర్ కుటుంబానికి పోలీసు భద్రత స్కీం యొక్క నగదు చెక్కు ను జిల్లా ఎస్పి నరసింహ జిల్లా పోలీస్ కార్యాలయం నందు సోమవారం అతని కుటుంబ సభ్యులకు అందజేసారు. పోలీసు శాఖలో పని చేస్తూ ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలను పోలీసు శాఖ అన్ని విధాలుగా అదుకుంటుందని, దివంగత సిబ్బంది కుటుంబాలకు పోలీసు భద్రత స్కీమ్ బాసటగా నిలుస్తుంది అన్నారు. కమలాకర్ కుటుంభం యొక్క సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, పోలీసు సంఘం అధ్యక్షులు ఎస్ఐ రామచందర్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

## ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం

### తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్.

ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో, జులై 13,(విజన్ ఆంధ్ర)ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షపాతం లేకపోవడంతో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వినతులు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఉన్నందున జిల్లాలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు,పాఠశాలలు,హాస్టళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మండల స్థాయి అధికారులు ప్రతి రెండు వారాలకు ఒకసారి హాస్టళ్లు, పీహెచ్‌సీలు,అంగన్‌వాడీ కేంద్రాలను తప్పనిసరిగా తనిఖీ చేసి,వాటి నివేదికలను స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్‌కు సమర్పించాలని సూచించారు.పాఠశాల విద్యార్థుల యూనిఫాంను ఈ నెల 15వ తేదీలోగా రెసిడెన్సియల్ పాఠశాలల బాలికలకు పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సోమవారం జరిగిన ప్రజావాణిలో మొత్తం 105 దరఖాస్తులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు 55, తక్కిన శాఖలకు 50 దరఖాస్తులు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొని ప్రజల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించారు.

## ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనం అందరు జర్నలిస్టులకు అందుబాటులో ఉండాలి



వేములవాడ రాజన్న సిరిసిల్ల, జూలై 13 (విజన్ ఆంధ్ర బ్యూరో):వేములవాడలో ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనాన్ని ఏ ఒక్క జర్నలిస్టు సంఘానికి పరిమితం చేయకుండా, అన్ని జర్నలిస్టు సంఘాల సభ్యులు సమాన హక్కులతో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) హెచ్-143 వేములవాడ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు సోమవారం ఆర్డీవో కుమారి, ఎంపీడీవో బింగి కీర్తనలకు వినతిపత్రం సమర్పించారు. టీయూడబ్ల్యూజే హెచ్-143 వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలి ఆధ్వర్యంలో సమర్పించిన వినతిపత్రంలో, ప్రభుత్వ ఆస్తిగా నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనం వేములవాడ ప్రాంతంలోని జర్నలిస్టులందరి సంక్షేమం, వృత్తిపరమైన సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు మరియు ఇతర కార్యకలాపాల కోసం ఉద్దేశించబడిందని పేర్కొన్నారు. అందువల్ల ఏ ఒక్క సంఘానికో లేదా కొంతమంది వ్యక్తులకో పరిమితం చేయకుండా, అన్ని జర్నలిస్టు సంఘాలకు సమాన అవకాశాలు కల్పించే విధంగా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి భవన నిర్వహణ చేపట్టాలని కోరారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన ఆర్డీవో కుమారి, ఎంపీడీవో బింగి కీర్తన ఈ అంశంపై ప్రభుత్వ నిబంధనలు, సంబంధిత రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారు జితేందర్ రావు, ఉపాధ్యక్షులు సీహెచ్ దేవరాజు, విష్ణు, ఫహద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలి

### టిడబ్ల్యుజేఎఫ్ జిల్లా అధ్యక్షులు టి. రాంచందర్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 13 ( విజన్ ఆంధ్ర) : అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని టిడబ్ల్యుజేఎఫ్ జిల్లా అధ్యక్షులు టి. రాంచందర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీ డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాను ఉద్దేశించి టిడబ్ల్యుజేఎఫ్ జిల్లా అధ్యక్షులు టి. రాంచందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులు భారీ సంఖ్యలో ఉన్నారని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎండనక, వాననక విధుల్లో ఉంటున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ ప్రాణాలకు తెగించి పోరాడారని ఆయన చెప్పారు. ఉద్యమం సందర్భంగా, ఆ తరువాత కూడా వందలాది మంది చనిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల విధానాలు మారిపోతున్నాయి. కానీ, జర్నలిస్టుల బతుకుల్లో మాత్రం ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్న రెండు వర్కింగ్ జర్నలిస్టు చట్టాలను యూనియన్ గవర్నమెంట్ కోడ్‌ల కింద మార్చేసి హక్కులను కాలరాసిందని దుయ్యబట్టారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని అటు యూనియన్ ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అభివృద్ధి, సంక్షేమ పథకాలను జర్నలిస్టులకు అందడం లేదని విచారం వ్యక్తం చేశారు. చివరకు వృత్తి నిర్వహణకు కావాల్సిన అక్రిడిటేషన్ కార్డులు సైతం సకాలంలో ఇవ్వడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక ఉద్యమాల ఫలితంగా గత రెండు నెలల నుంచి అక్రిడిటేషన్ కార్డులు జారీచేస్తున్నారని ఆయన అన్నారు. అర్హులైన వారందరికి ఇవ్వాలనేది తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ప్రధాన ఉద్దేశమని ఆయన అన్నారు. జిల్లా కార్యదర్శి ఎండి షఫీ మాట్లాడుతూ గత 40 ఏండ్లుగా ఉమ్మడి రాష్ట్రంతోపాటు తెలంగాణలోనూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని త్వరితగతిన అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్సు పాసులతో పాటు కొత్తగా మెట్రో పాసులను, రైల్వే పాసులను పునరిద్ధించాలన్నారు. మోడీ సర్కార్‌పై ఒత్తిడి తెచ్చచి మస్యలను వెంటనే సానుకూలంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కౌన్సిల్ మెంబర్ మాసాని వెంకటయ్య, కోశాధికారి ప్రశాంత్, ఉపాధ్యక్షులు హఫీజ్, భీమ్ శాప్ప, శ్రీనివాస్, అనంతయ్య, మురళి గుప్త, కృష్ణ, ఉదయ్, కార్యదర్శులు ఏ. ఆనంద్, ఎజాజ్, జి శ్రీనివాస్, కృష్ణ, అరుణ్ రెడ్డి, నాగిరెడ్డి, జగన్, శ్రీకాంత్, రాకేష్, సంతోష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి - జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, జులై 13 (విజన్ ఆంధ్ర): ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం సంబంధిత అధికారుల ప్రాథమిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పథకం, భూ సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 85 ఫిర్యాదులు కలెక్టర్‌కు అందాయి. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, ఏవో వర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ సంతోషి మాత దేవాలయంలో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం



సూర్యాపేట జూలై 13:(విజన్ ఆంధ్ర)సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో సోమవారం మాస శివరాత్రి సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణాన్ని దేవాలయ ప్రధాన అర్చకులు శివరామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రక్తంగా ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆరుద్ర నక్షత్రం,స్వామి వారి జన్మ దినము సందర్భముగా ప్రత్యేక అభిషేకములు నిర్వహించారు. భక్తులే స్వామి వారి గర్భ గుడిలోకి ప్రవేశించి అభిషేకం చేసుకునే విధంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామూహిక లలితా సహస్రనామ పారాయణ ము నిర్వహించి, అమ్మవారిని కీర్తిస్తూ పాటలు పాడారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ గౌరవ అధ్యక్షులు నూక వెంకటేశం గుప్తా, అధ్యక్షులు బ్రాహ్మణపల్లి మురళీధర్, ప్రధాన కార్యదర్శి పబ్బ ప్రకాశరావు, కోశాధికారి కొత్త మల్లికార్జున్, ఉపాధ్యక్షులు సోమ శ్రీశైలం, బెలిదే అశోక్, దేవరశెట్టి సోమయ్య, తాళ్లపల్లి రామయ్య, మహంకాళి ఉపేందర్,జే.శశిధర్ న్యాయవాది కమిటీ సభ్యులు కక్కిరేణి పద్మ, కర్నాటి సూర్య కళ, కొల్లూరు రత్నమాల, నూక ముత్యాలమ్మ, మహంకాళి కవిత, బచ్చు నీరజ, సువర్ణ,రేణుక,శ్రీదేవి,మాధవి,దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


# విలేజ్ డైరెక్టరీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

### ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 8 వరకు గ్రామాల మౌలిక వసతులపై సమగ్ర సర్వే

### గ్రామ పాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు కలెక్టరేట్‌లో శిక్షణ ప్రారంభం

### ఖచ్చితమైన సమాచార సేకరణతో డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్ రూపకల్పనకు సహకరించాలి

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్(విజన్ ఆంధ్ర బ్యూరో), జూలై 13: పాపులేషన్ సెన్సస్ 2027లో భాగంగా నిర్వహించనున్న విలేజ్ డైరెక్టరీ సర్వేను అత్యంత కచ్చితత్వంతో, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ చిత్రా మిశ్రా గ్రామ పాలన అధికారులు (జీపీఓలు), పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్హెచ్‌డీ) ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో గ్రామ పాలన అధికారులు పంచాయతీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులు జూలై 13 నుంచి జూలై 16 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు వివరించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా అవగాహన చేసుకొని, సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేసుకోవాలని సూచించారు. గ్రూప్ డిస్కషన్ ద్వారా శిక్షణలో చర్చించిన అంశాలను మరింత లోతుగా అర్థం చేసుకుని, క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 8 వరకు జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలు, మున్సిపాలిటీలలో విలేజ్ డైరెక్టరీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సౌకర్యం, విద్యుత్, ఆస్పత్రులు, డ్రైనేజీ వ్యవస్థ, ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక, మాధ్యమిక విద్యాసంస్థలు, పశువైద్య సేవలు తదితర మౌలిక వసతులతో కూడిన తొమ్మిది సెక్షన్లకు సంబంధించిన సమాచారాన్ని నిర్దిష్ట నమూనాలో సేకరించి పాపులేషన్ సెన్సస్ యాప్లో నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు. సేకరించిన సమాచారాన్ని సంబంధిత 16 మండలాల ఛార్జ్ ఆఫీసర్లు/తహసీల్దార్లు, మూడు మున్సిపాలిటీల కమిషనర్లు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పరిశీలించి, అవసరమైన సవరణలు చేసిన అనంతరం పాపులేషన్ సెన్సస్ డిపార్ట్‌మెంట్కు పంపిస్తారు. అనంతరం రాష్ట్ర సెన్సస్ అధికారులు ధృవీకరించి, పాపులేషన్ సెన్సస్ డిపార్ట్‌మెంట్, ఢిల్లీకి ఫార్వర్డ్ చేస్తారు. తుది పరిశీలన అనంతరం ప్రతి జిల్లాకు డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ) విడుదల చేయబడుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 16 మండలాల నుంచి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక్కో గ్రామ పాలన అధికారి లేదా పంచాయతీ కార్యదర్శితో పాటు మూడు మున్సిపాలిటీలు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ప్రతినిధులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర, ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రాందత్తా రెడ్డి, జిల్లా గణాంక అధికారి, అడిషనల్ డిస్ట్రిక్ట్ సెన్సస్ ఆఫీసర్ వెల్డి కిషన్ రావు, రాష్ట్ర సెన్సస్ విభాగానికి చెందిన తిరుపతి, శివప్రసాద్ రెడ్డి, జిల్లా సెన్సస్ విభాగం డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ జ్యోతితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం

### ఆదిలాబాద్ టు అసెంబ్లీ 'రైతు యాత్ర'కు ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపు



ఆదిలాబాద్, జూలై 13 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పంటల బీమా) పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో రైతులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అతివృష్టి, అనావృష్టి సమయాల్లో రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫసల్ బీమా యోజన పథకాన్ని తీసుకువచ్చారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఈ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యమై ఉంటే, నష్టపోయిన ప్రతి రైతుకు రూ. 45 వేల నుంచి రూ. 50 వేల వరకు బీమా అంది ఆర్థికంగా బాగుపడేవారన్నారు. ఈ విషయంపై తాను ఇప్పటికే రెండుసార్లు అసెంబ్లీలో ప్రస్తావించానని తెలిపారు. గతంలో పంటల బీమా పథకం అమలు కోసం బడ్జెట్‌లో రూ. 3 వేల కోట్లు కేటాయించినందుకు తాము ప్రభుత్వానికి ధన్యవాదాలు కూడా తెలిపామని, కానీ ఏడాది గడిచినా అందులో మూడు రూపాయలు కూడా ఖర్చు చేయకపోవడం దారుణమని ధ్వజమెత్తారు. ఈ నెల 30వ తేదీతో పంటల బీమా గడువు ముగుస్తున్నా, ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించలేదని, రైతులు కట్టే ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని అమలు చేయకపోతే రైతులతో కలిసి ఆదిలాబాద్ నుంచి అసెంబ్లీ వరకు 'రైతు యాత్ర' చేపడతామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ హెచ్చరించారు. ఈ యాత్ర ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని, ఇందుకోసం రైతులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు ప్రతినిధులు రాందాస్, దయాకర్, బెన్సన్ రెడ్డి, సతీష్ యాదవ్, రాము, దినేష్ మాటోలియా, ఆకుల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆటగాళ్లకు 'గేమ్ చేంజర్ అవార్డు'లు ప్రదానం

### టీజీ-20తో తెలంగాణ క్రీడాభివృద్ధికి బీబీజీ గ్రూప్ మద్దతు




హైదరాబాద్, జూలై 13 (విజన్ ఆంధ్ర) : శ్రీనిధి యూనివర్సిటీ టీజీ-20 లీగ్-2026 ముగింపు సందర్భంగా టోర్నీకి అధికారిక స్పాన్సర్‌గా వ్యవహరించిన సంస్థ, అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఆటగాళ్లకు 'గేమ్ చేంజర్ అవార్డు'లను ప్రదానం చేసినట్లు బీబీజీ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ క్రీడా రంగ అభివృద్ధికి తమ నిబద్ధతను బీబీజీ గ్రూప్ పునరుద్ఘాటించిందని తెలిపారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. సమాజ అభివృద్ధికి ఎల్లప్పుడూ తమ సంస్థ మద్దతు కొనసాగుతుందని తెలిపారు. బీబీజీ గ్రూప్ ద్వారా బంగారు తల్లి ఫౌండేషన్ ద్వారా బాలికల సాధికారతకు సేవలందిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో క్రీడా సంస్కృతి అభివృద్ధికి భవిష్యత్తులోనూ తోడ్పాటును కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించండి

కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూలై 13..ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రాఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా.. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ స్వామి, ఆర్డీవో షర్మిల, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 170 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 59, కరీంనగర్ నగరపాలికకు 50 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

### సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల స్పెల్-2 శిక్షణ తరగతులను సందర్శించిన జిల్లా విద్యాధికారి డి. వాసంతి



కొత్తగూడెం 3, జూలై 14(విజన్ ఆంధ్ర)ఉపాధ్యాయులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకొని విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని జిల్లా విద్యాధికారి డి. వాసంతి సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్పెల్-2 శిక్షణా తరగతులను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా సంవత్సరంలో వివిధ తరగతుల పాఠ్యాంశాలకు సంబంధించిన లెర్నింగ్ అవుట్‌కమ్‌లు విద్యార్థులు సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తద్వారా జిల్లాకు సంబంధించిన పర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండెక్స్ ర్యాంకును మరింత మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తమ బోధనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించి బోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులకు కూడా×× వినియోగంపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఎదిగి మెరుగైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న బోధనా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఆమె సూచించారు. అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక రెమిడీయల్ తరగతులు నిర్వహించి వారి విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలని ఆదేశించారు. ఇంగ్లీష్ మీడియం పాఠ్యాంశాలను సాధ్యమైనంత వరకు ఇంగ్లీష్‌లోనే బోధించడం ద్వారా విద్యార్థుల్లో స్పోకెన్ ఇంగ్లీష్ నైపుణ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి మాధవరావు, సంబంధిత విద్యాశాఖ అధికారులు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతే మొదటి ప్రాధాన్యత - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, జూలై 13 (విజన్ ఆంధ్ర): విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేదని, పాఠశాలలు, కళాశాలలకు చెందిన ప్రతి బస్సు పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో పాటు అన్ని భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఆదిలాబాద్ పట్టణంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది ప్రతినిధులు, డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులను తరలించే ప్రతి బస్సు పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో ఉండాలని ఆదేశించారు. బస్సుల్లో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ వంటి భద్రతా పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి బస్సులో డ్రైవర్‌తో పాటు ఒక అటెండర్ తప్పనిసరిగా ఉండాలని, విద్యార్థులు బస్సు ఎక్కే సమయంలో, దిగే సమయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బస్సు నడిపే ప్రతి డ్రైవర్‌కు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని ఎస్పీ పేర్కొన్నారు. డ్రైవర్లు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని, సరైన విశ్రాంతి, తగిన నిద్ర అనంతరమే విధులకు హాజరుకావాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ఒకవేళ డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే డ్రైవర్లతో పాటు సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జాతీయ రహదారులపై అతివేగం, రాంగ్ సైడ్ ప్రయాణం, నిర్లక్ష్యంగా ఓవర్‌టేక్ చేయడం వంటి చర్యలు తీవ్ర ప్రమాదాలకు దారితీస్తాయని ఎస్పీ హెచ్చరించారు. సమయానికి చేరుకోవాలనే ఉద్దేశంతో వేగంగా బస్సులు నడపడం సమర్థనీయం కాదన్నారు. ముఖ్యంగా రైల్వే గేట్ల వద్ద ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, గేట్లు మూసి ఉన్నప్పుడు దాటేందుకు ప్రయత్నించరాదని సూచించారు. అలాగే ప్రయాణ సమయంలో విద్యార్థులు కిటికీల్లో నుంచి చేతులు, తలలు బయటకు పెట్టకుండా డ్రైవర్, అటెండర్ నిరంతరం పర్యవేక్షించాలన్నారు. చిన్నారుల ప్రాణాలు, వారి భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆశలు మీ చేతుల్లో ఉంటాయి. మీరు నడిపేది కేవలం బస్సు కాదు... అనేక కుటుంబాల భవిష్యత్తు. అందుకే ప్రతి ప్రయాణాన్ని అత్యంత బాధ్యతతో నిర్వహించాలని డ్రైవర్లకు ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, టౌన్ సీఐలు బి. సునీల్ కుమార్, కె. నాగరాజు, ప్రణయ్ కుమార్, ట్రాఫిక్ పోలీసు అధికారులు, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి పర్యటన

### జులేకల్ వద్ద భారీ బహిరంగసభ ఏర్పాటు

### జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఇ. సురేష్ గౌడ్

అలంపూర్ జూలై 13 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఇ. సురేష్ గౌడ్ తన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలని ఉద్దేశించి మాట్లాడుతూజూలై 14 మంగళవారం రోజు అలంపూర్ నియోజకవర్గంలోని మేడికొండ, పచ్చర్ల ,జులకల్,పుల్లూర్ గ్రామాలలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి ,ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ విచ్చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని స్థాయిలలో చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు,సర్పంచులు ఉప సర్పంచ్లు, సింగిల్ విండో డైరెక్టర్లు ,మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, రైతులు , యూత్ సభ్యులు,అభిమానులు మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

# సంపూర్ణ ఆరోగ్యానికి నులి పురుగు నివారణ మాత్ర వేసుకోవాలి

### ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించగలరు

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

### జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా హనుమకొండ ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేసిన కలెక్టర్




హనుమకొండ జిల్లా ప్రతినిధి జూలై 13 (విజన్ ఆంధ్ర) 1 నుంచి 19 సంవత్సరాల వయసున్న ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యానికి నులిపురుగు నివారణ మాత్రను వేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డెవర్మింగ్ డే) సందర్భంగా హనుమకొండలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో ఉత్తమ ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. పరీక్షల్లో ఆశించిన మార్కులు రాకపోవడానికి ప్రధాన కారణాల్లో ఒకటి అనారోగ్యం వల్ల పాఠశాలకు సరిగా హాజరు కాకపోవడమేనన్నారు. నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపడి, పోషకాహారం శరీరానికి సక్రమంగా అందడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. నులిపురుగులు కడుపులో ఉన్నట్లయితే బరువు ఎత్తు పెరగకుండా ప్రభావం ఉంటుందన్నారు. కాబట్టి ఒకటి నుంచి 19 ఏళ్ల వయసున్న వారు నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రను తీసుకోవాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, సమయానికి నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని సూచించారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్నట్లు పేర్కొన్నారు. నులి పురుగుల నివారణ మాత్ర వేసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎలాంటి హానిచేయదని పేర్కొన్నారు. నులిపురుగుల నివారణ కోసం మాత్రను వేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటుందన్నారు. పాఠశాల విద్యార్థులు తమ చుట్టుపక్కల ఉన్నవారికి నులిపురుగుల నివారణ కోసం వేస్తున్న మాత్రను గురించి తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్ర ఆల్బెండజోల్ ను పంపిణీ చేశారు. ఆ మాత్రను విద్యార్థులు నమిలి తిన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి, కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ సుమా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 19 లోపు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తి చేయాలి

### సర్ ఫారం పూర్తిచేసి ఇవ్వకుంటే ప్రభుత్వ పథకాలకు అర్హులు కారు

### ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 13,(విజన్ ఆంధ్ర)ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ఫారంలో ఓటర్లు పూర్తి చేసి బి ఎల్ వో లకు అందించాలని, ఈ ప్రక్రియ పూర్తి చేయకపోతే ఓటుకోల్పోయే అవకాశం ఉంటుందని, అంతేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు కారని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఈనెల 19 లోపు ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ఫారాలను పూర్తి చేయాలని కోరారు. సర్ ప్రక్రియ చివరి తేదీ ఈనెల 24 వరకు గడువు ముగుస్తుందని చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు. బి ఎల్ ఓ బిలీలు పార్టీ నాయకులు తీవ్రంగా కష్టపడుతున్నప్పటికీ మరింత వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రక్రియ పూర్తయిపోతే జులై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల



చేస్తారని, అక్టోబర్ 31 వరకు చివరి ఓటర్ లిస్టు తయారవుతుందన్నారు. సర్ ప్రక్రియలో హోటల్ వారంలో పూజ చేయనట్లయితే తర్వాత చాలా క్లిష్ట పరిస్థితి ఏర్పడతాయని సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అనర్హులుగా మిగిలిపోతారని పేర్కొన్నారు. సర్ ప్రక్రియ లో పాల్గొనకపోతే ముందుగా రేషన్ కార్డు తొలగిపోతుందని దీంతో రేషన్ బియ్యం రావని ఆసరా పెన్షన్లు ఇందిరమ్మ ఇల్లు ఉచిత విద్యుత్తు మహాలక్ష్మి పథకము లాంటి పథకాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. నియోజకవర్గంలోని ఓటర్లు తప్పకుండా ఈ ప్రక్రియలో పాల్గొని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సర్ ను శ్రద్ధ చేయవద్దని ఎమ్మెల్యే కోరారు. చివరి తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగితే ఇంటర్నెట్లో సర్వర్లు మురాయిస్తాయని అప్పుడు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని అన్నారు. రెండు చోట్ల ఓటు కలిగిన వారు ఒకే చోట నింపాలని రెండు చోట్ల నింపినట్లైతే ఓటు తొలిగిపోయే అవకాశం ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధం లేదని, ప్రతి ఒక్కరూ ముందుండి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఈ ప్రక్రియను పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు చివరి వరకు వేచి చూడవద్దని ఓటును కోల్పోవద్దని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికార యంత్రాంగం సైతం సర్ ప్రక్రియపై దృష్టి సారించి వేగవంతం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సర్ ప్రక్రియలో పాల్గొనకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోల్పోయే దుస్థితి నెలకొంటుందని పోస్టర్ల ద్వారా ప్రజలకు ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణి లో 52 దరఖాస్తులు

### క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 13,(విజన్ ఆంధ్ర)ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. తాండూరు మండలం తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన బోయిని శ్రీనివాస్ తాను ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్నానని, ఇంటి నెంబర్ మార్పు కొరకు అనుసరించవలసిన విధానాన్ని తెలుపాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చీకటి కిషోర్ కుమార్ గౌడ్ గ్రామంలో గ్రామపంచాయతీ మురుగు కాలువపై నిర్మించిన అక్రమ కట్టడాన్ని తొలగించడంపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చెన్నూర్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన నిట్టూరి మధుకర్ తన తాతకు చెందిన ఆస్తిని తనకు తెలియకుండా పట్టా మార్పిడికి ప్రయత్నాలు చేస్తున్నారని, నిలుపుదల చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి మండలం చిర్రకుంట గ్రామ రైతులు తమ పొలాలకు వెళ్లే ప్రభుత్వ దారిని కబ్జా నుండి కాపాడి పునరుద్ధరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 52 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అనంతరం గత వరద పరిస్థితులలో జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో వరద నీటికి కొట్టుకుపోయి మృతి చెందిన గొర్రెలకు సంబంధించి గొర్రెల యజమాని పొనవేని రాజబాబు కు 1 లక్ష 25 వేల రూపాయల నష్టపరిహారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 15న మహా ధర్నాను జయప్రదం చేయండి

### సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు మంద సంపత్



హన్మకొండ జిల్లా ప్రతినిధి , జూలై 13 (విజన్ ఆంధ్ర)కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు ) సిపిఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు మంద సంపత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ మండల కమిటీ సభ్యుడు ఇస్లావత్ రవీందర్ తో కలిసి జూలై 15న జరిగే నిరుద్యోగుల మహా ధర్నా కరపత్రాలను పబ్లిక్ గార్డెన్ వద్దనున్న జిల్లా గ్రంథాలయ సంస్థలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంద సంపత్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కాయని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చడం లేదు అన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సుమారు పది లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో ఉన్న 20000 ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేసి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ , జేఎల్ , డిఎల్, గ్రూప్-1 ,2, 3, 4 తో పాటు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే వరకు 5000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ను యూత్ డిక్లరేషన్ను అమలు చేయాలని కోరారు. అదేవిధంగా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని అన్నారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్లాగ్ పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు . ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 15న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగే మహా ధర్నాలో నిరుద్యోగ యువత వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# ఉద్యోగుల ఆరోగ్యమే పనితీరుకు బలం

### - జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### సమీకృత కలెక్టరేట్‌లో ఉచిత సమగ్ర వైద్య శిబిరం ప్రారంభం

### బీపీ పరీక్ష చేయించుకున్న జిల్లా కలెక్టర్



రాజన్న సిరిసిల్ల, జూలై 13 విజన్ (ఆంధ్ర బ్యూరో):జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది కోసం సోమవారం ఉచిత సమగ్ర వైద్య ఆరోగ్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ స్వయంగా బీపీ పరీక్ష చేయించుకుని ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను చాటిచెప్పారు. సెర్ప్, ఎరిక్సన్ టీపీఏ బీమా సంస్థ ఆధ్వర్యంలో, హైదరాబాద్ మలక్‌పేట్‌కు చెందిన యశోద హాస్పిటల్స్, కరీంనగర్ శరత్ మాక్సీ విజన్ ఆసుపత్రి సహకారంతో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ఉద్యోగులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మంచి ఆరోగ్యం ఉంటేనే విధులను సమర్థవంతంగా నిర్వహించగలరని అన్నారు.
శిబిరంలో జనరల్ ఫిజీషియన్, గుండె, స్త్రీ, నేత్ర వైద్య నిపుణులు ఉద్యోగులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అధికారులు, సిబ్బంది పాల్గొని ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి జయశీలతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీకి ఘన సన్మానం

### జర్నలిస్టుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవి: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొండ దేవయ్య


వేములవాడ రాజన్న సిరిసిల్ల, జూలై 13 (విజన్ ఆంధ్ర ):తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) హెచ్-143 వేములవాడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులను మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొండ దేవయ్య ఘనంగా సన్మానించి అభినందించారు.సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు డా. కొండ దేవయ్యను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం మున్నూరు కాపు సత్రం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా. కొండ దేవయ్య ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువచ్చి వాస్తవాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. సమాజ నిర్మాణంలో మీడియా బాధ్యత ఎంతో కీలకమని పేర్కొన్నారు. వేములవాడ ప్రెస్‌క్లబ్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ, జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవ పరిరక్షణకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ సయ్యద్ రసూల్, ప్రెస్‌క్లబ్ గౌరవ సలహాదారులు కొత్వాల్ శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి కముటాల విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జింక శ్రీధర్, డెప్యూటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు, సంటి రాజేందర్, షబ్బీర్ నవీన్, ఆసీమ్ తదితరులు పాల్గొన్నారు.

# భయపడకండి అండగా మేముంటాం - పట్నం మహేందర్ రెడ్డి

### నిందితునికి అండగా నిలిచిన పోలీసులపై చర్యలు : కలెక్టర్ నారాయణరెడ్డి

### మేఘనకు అండగా నిలుస్తాం : ఎమ్మెల్యే యాదయ్య

### మేఘనకు రూ. 10 లక్షల చెక్కును అందించిన మహేందర్ రెడ్డి, యాదయ్య, కలెక్టర్ నారాయణ రెడ్డి



షాబాద్, జూలై 13(విజన్ ఆంధ్ర)షాబాద్ లో రాజ్ కుమార్ హత్యాకాండబాధితుల ఇంటిని మరోసారి సందర్శించి బాధితులతో శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడారు. అనంతరం బాధిత కుటుంబ దివ్యాంగురాలుమేఘనకు ప్రభుత్వం తరఫున రూపాయలు 10 లక్షల చెక్కును అందించారు. మేఘన పరిస్థితి తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక సహాయాన్ని రూపాయలు ఐదు లక్షల నుండి పది లక్షలకు పెంచారని వారు వివరించారు. అలాగే ఇందిరమ్మ ఇల్లు తో పాటు మేఘనకు మానసిక వికాసం కోసం మూడు ప్రభుత్వ పునరావాస కేంద్రాలను పరిశీలించామని ఇందులో సికింద్రాబాద్ పునరావాస కేంద్రం బాగుందని అందులో చేర్పిస్తామని వివరించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు, మేనమామ నరేష్ తదితరులు నిందితునికి పోలీసులు పూర్తిగా సహకరించారని ఇది ఎక్కడ విచిత్రమైన పరిస్థితి అని వారు ప్రశ్నించారు. పోలీస్ పెట్రోలింగ్ లేనందు వల్లే అఘాయిత్యం జరిగిందని ఫిర్యాదు చేశారు. తాము కుటుంబాన్ని కోల్పోయామని మేఘన అనాధగా మిగిలిపోయిందని వారు వాపోయారు. కేసులో నిందితునికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన మహేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఎమ్మెల్యే యాదయ్యలు పెట్రోలింగ్ వ్యవస్థను పెంచుతున్నట్లు ప్రకటించారు. నిందితునికి సహకరించినట్లు విచారణలో తేలితే చట్ట ప్రకారం చర్యలు కఠినంగా ఉంటాయని వారు బాధితులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తుందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారంమేఘనకు జీవిత కాలం వరకు ప్రభుత్వం అవసరమైన సదుపాయాలను కల్పిస్తుందని వెల్లడించారు. మేఘన తండ్రి ప్రభుత్వ ఉద్యోగి అయినందున ఆయనకు రావలసిన పెన్షన్ మేఘనకు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులను ఆదేశిస్తామని వెల్లడించారు. అలాగే ఇతర విషయాలకు సంబంధం లేకుండా దివ్యాంగురాలు అయిన మేఘనకు వికలాంగుల పెన్షన్ సైతం యధావిధిగా వస్తుందని వెల్లడించారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ ఘటన దురదృష్టకరమని, బాధాకరమని పేర్కొంటూ మేఘన కుటుంబానికి తాము ఎల్లవేళలా అండగా నిలుస్తామని వివరించారు. పోలీసుల వైఫల్యం లేకుండా ఇకపై పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేసేలా ఆదేశిస్తున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా బాధిత కుటుంబానికి అందాల్సినవి అన్నీ అందిస్తామని వెల్లడించారు. మేఘనకు పునరావాస కేంద్రంలో వైద్యం మానసిక వికాసం తదితరాలకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రస్తుతం రూ. 10 లక్షల పరిహారం అందించామని అవసరమైతే మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. తరుణ్ జోషి,అడీషనల్ డిసిపి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి,గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచ్ అశోక్, ఉపసర్పంచ్ రాహుల్,మాజీ సర్పంచ్ తమ్మలి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


# ఉమ్మడి పాలమూరుకు 'అద్దం'లాంటి రోడ్లు - మంత్రి కోమటిరెడ్డి

### రూ. 359.09 కోట్లతో 171.96 కి.మీ. హ్యామ్ రోడ్డు పనులకు శంకుస్థాపన

### 2028 నాటికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రహదారుల సమూల మార్పు

### వనపర్తిలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు పర్యటన

ఎవనపర్తి జిల్లా ప్రతినిధి, జూలై 13 (విజన్ ఆంధ్ర)ఉమ్మడి పాలమూరు జిల్లాలో పూర్తిస్థాయి రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. పాలమూరు ఇక వెనుకబడిన జిల్లా కాదని, అభివృద్ధి దిశగా దూసుకుపోతోందని ఆయన పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో రూ. 359.09 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 171.96 కి.మీ. ల ఆర్ అండ్ బి హ్యామ్ (హైబ్రిడ్ అన్యుటీ మోడల్) రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎఈ సందర్భంగా వనపర్తి రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రహదారుల అభివృద్ధి కోసం రూ.3,000 కోట్ల నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామని, 2028 నాటికి జిల్లాలో అద్దంలాంటి రోడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రసిద్ధ కురుమూర్తి స్వామి దేవాలయానికి అద్భుతమైన రహదారులను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా అందిస్తున్నామని పేర్కొన్నారు.ఎమంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ,



రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా ఆరు గ్యారంటీల అమలుతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, రైతు భరోసా, రుణమాఫీని ప్రభుత్వం నిరంతరాయంగా కొనసాగిస్తోందని చెప్పారు.ఎవనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే రూ.2 వేల కోట్లకు పైగా నిధులు తెచ్చామని, వనపర్తికి ఐటీ టవర్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ మంజూరయ్యాయని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రధాన రహదారులను డబుల్ రోడ్లుగా మార్చేందుకు మరో రూ.124 కోట్లు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డిని కోరారు.ఎఈ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీతారెడ్డి, అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వ పాలన

**- జిల్లాలో రూ. 339 కోట్ల నిధులతో హామ్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన**

**- మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి,జూపల్లి కృష్ణారావు**



గద్వాల జూలై 13 (విజన్ ఆంధ్ర బ్యూరో) : సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం ప్రజా రంజక పాలన అందిస్తోందని రహదారులు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం ధరూర్ మండల కేంద్రంలో జోగులాంబ జిల్లా వ్యాప్తంగా వివిధ రహదారుల విస్తరణ, మరమ్మత్తుల నిర్మాణానికి రూ.339.39 కోట్ల నిధులతో చేపట్టిన హామ్ రోడ్ల పనులకు మంత్రి ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం సమీపంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదట మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాక 3.18 కోట్ల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నమన్నారు. గృహ జ్యోతి పథకంతో నెలకు అర్హులైన ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ను అందించడం జరుగుతోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా వారికి పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. మహిళలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తున్నామన్నారు. ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడంతో మహిళా సంఘాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 25 వేల కోట్లకు పైగా నిధులను మంజూరు చేయడం గర్వకారణమన్నారు. గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 15 టీఎంసీలకు పెంచడం ద్వారా కరువు పరిస్థితుల్లోనూ తాగు, సాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. ఉమ్మడి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీటిని అందించడం జరుగుతుందన్నారు. గట్టు ఎత్తిపోతల పథకాన్ని కూడా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి కుటుంబం తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. మహిళా, రైతు, యువజన సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రోడ్లకు మహర్దశ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం హామ్ రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేసిందన్నారు. గతంలోనూ మంత్రి జూపల్లి సహకారంతో గద్వాల నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ రహదారుల నిర్మాణానికి రూ .40 కోట్ల నిధులను మంజూరు చేశారని గుర్తు చేశారు. నిరుద్యోగ యువతకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. గద్వాల నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఇటీవల ముఖ్యమంత్రి గుడ్డెందొడ్డి రిజర్వాయర్ ను సందర్శించి దాని సామర్థ్యాన్ని 15 టిఎంసిలకు పెంచేందుకు ప్రతిపాదించడం జరిగిందన్నారు. అంతకుముందు ధరూర్ కు చేరుకున్న మంత్రులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు పుష్పగుచ్చాలు, మొక్కలు అందజేసి, శాలువాలతో సన్మానించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, గొర్రెలు మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ సరిత, వాల్మీకి బోయ కార్పోరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, డిఈ భాస్కర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## టి - ఫైబర్ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 13, విజన్ ఆంధ్ర : జిల్లాలో టి - ఫైబర్ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సాధించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా అటవీ అధికారి బాలమణి, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిషయ్యలతో కలిసి జిల్లాలో టి ఫైబర్ విస్తరణ పై రెవెన్యూ, అటవీ, టెలికాం సంస్థల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలలో ఇంటర్నెట్ సేవలు మరింత సౌకర్యవంతంగా అందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు జిల్లాలో టి ఫైబర్ సేవలు సమగ్రంగా అందించేందుకు గాను విస్తరణ సంబంధిత అనుమతుల కొరకు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర అధికారులకు పంపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి ఫైబర్ అదనపు సంచాలకులు శ్రీనివాస్, జనరల్ మేనేజర్ సురేష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శశిధర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిబాయ్ పూలే బాలికల పాఠశాల లో సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన




కామారెడ్డి బ్యూరో జులై 13(విజన్ఆంధ్ర) : కామారెడ్డి పట్టణంలోని మహాత్మ జ్యోతిబాయ్ పూలే బాలికల పాఠశాల లో సమాచార హక్కు చట్టం 2005 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలోని ఆజాంపురాలో గల మహాత్మ జ్యోతిబాయ్ పూలే తెలంగాణ ప్రభుత్వ పాఠశాల లో సమాచార హక్కు చట్టం 2005 పైన అవగాహన కల్పించారు. ఈకార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి మాధవి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎంఎ సలీం పాల్గొని,ఈ సందర్భంగా విద్యార్థినిలకు సమాచార హక్కు చట్టం పైన అవగాహన కల్పించారు. కామారెడ్డి జిల్లా ముఖ్య సలహాదారులు డి లింగమయ్య మాట్లాడుతూ చట్టం 2005 అనేది ఒక వజ్రాయంగా లాంటిదని అన్నారు, అలాగే సమాచార హక్కు చట్టం సెక్షన్ 6(1) మరియు మొదటి ఆపిల్ దరఖాస్తు విధానాన్ని విద్యార్థినులకు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పి గణేష్ విద్యార్థినిలకు సమాచార హక్కు చట్టం 2005 పైన అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## విద్యార్థునుల ప్రతిభను గుర్తించి నగదు బహుమతి ఇవ్వడం సంతోషం

**- ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి**

**- బాలికలు చదువుతో అన్ని రంగాల్లో ముందుకు సాగాలి**

**- కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి**




కామారెడ్డి బ్యూరో జులై 13(విజన్ఆంధ్ర) : కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలోని పి ఎం ఎస్ హెచ్ ఆర్ ఐ జెడ్పి హెచ్ ఎస్ బాలికల పాఠశాలలో గత సంవత్సరం ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శ్రీరామ్ చిట్స్ వారు నిర్వహించిన నగదు బహుమతుల ప్రదానోత్సవం, సన్మాన కార్యక్రమంలో కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ విద్యార్థినుల ప్రతిభను గుర్తించి నగదు బహుమతి ఇవ్వడం సంతోషం అని, ప్రస్తుతం కామారెడ్డి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయనీ, వాటిని సరిగ్గా వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలని, ముఖ్యంగా బాలికలు చదువుతో అన్ని రంగాల్లో ముందుకు సాగాలనీ అన్నారు.

## ఈనెల 15 నుండి శ్రీ వారాహి దేవి నవరాత్రి మహోత్సవములు

**- ఆచార్య వేణుగోపాల చారి**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 13,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 15 నుండి 23 వరకు శ్రీ వారాహి దేవి నవరాత్రి మహోత్సవములు నిర్వహించనున్నట్లు ఆచార్య వేణుగోపాల చారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సకల లోక కళ్యాణార్థం, భక్తుల కష్ట నివారణార్థం, మరియు సకల ఐశ్వర్య సిద్ధార్థం, ఆషాడ మాస పుణ్యకాలమును పురస్కరించుకొని మంచిర్యాల పట్టణంలో వాసుకి పరమేశ్వరి సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ వారాహి దేవి నవరాత్రి మహోత్సవములు అత్యంత వైభవంగా నిర్వహించబడునని తెలిపారు. ఈ నవరాత్రి మహోత్సవంలో అమ్మవారికి ఒక్కో రోజు ఒక్కో అలంకరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ పరమ పవిత్రమైన నవరాత్రులలో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావలసిందిగా కోరారు.

## కామారెడ్డి జిల్లా పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా పిన్నం రామచంద్రం



కామారెడ్డి బ్యూరో జులై 13(విజన్ఆంధ్ర) : ఎంపిక చేస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ కుమార్ ప్రకటించారు. ఆదివారం నాడు నిజామాబాద్ జిల్లా పెరుక సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు విజయకుమార్. కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా దోమకొండ గ్రామానికి చెందిన రామచంద్రం ఎంపిక చేయగా. రాష్ట్ర పెరిక సంఘం ఉపాధ్యక్షుడిగా దోమకొండ గ్రామానికి చెందిన మర్రి శేఖర్ ను ఎంపిక చేస్తున్నట్లు ప్రకటించారు. వీరిని విజయకుమార్ ప్రమాణస్వీకారం చేయించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే తో భవిష్యత్తులో వివాదాలు ఉండవు

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి. జూలై 13,( విజన్ ఆంధ్ర) : ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియతో భవిష్యత్తులో భూ వివాదాలు ఉండవని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదరపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. వినయ్ లతో కలిసి భూముల రీ సర్వే మండలాల తహసిల్దార్లు, మండల సర్వేయర్లు, గిర్ధవార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే కొరకు ఎంపిక చేసిన గ్రామాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సర్వే నిర్వహించాలని తెలిపారు. భూముల రీ సర్వే ప్రక్రియ ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు ఎలాంటి అవకాశం ఉండదని తెలిపారు. మొదటి విడతలో జిల్లాలో గ్రామ నక్షాలు లేని 37 గ్రామాలు ఉన్నాయని, రెండవ విడతలో 70 గ్రామాలు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. మొదటి విడతలో ఎంపిక చేసిన గ్రామాలలో సర్వే నిర్వహించడంతో గ్రామ నక్షా రూపొందించడం జరుగుతుందని, 2వ విడతలో ఎంపికైన గ్రామాలలో రీ సర్వేలో భాగంగా ఎంజాయ్మెంట్ సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సర్వే ప్రక్రియలో డి జి పి ఎస్, రోవర్స ను ఉపయోగించడం జరుగుతుందని, సర్వే పూర్తి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రీ సర్వేతో భవిష్యత్తులో రైతుల మధ్య పొలాల గెట్ల గొడవలు ఉండవని, రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదాలు గల భూముల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సర్వే ఉద్దేశం ప్రజలకు వివరించి ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో జిల్లా మంచి స్థానంలో ఉందని, ప్రస్తుతం 67 శాతం ఫారాల డిజిటలైజేషన్ జరిగిందని, వారంలోగా ఎన్యువరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తిచేయాలని తెలిపారు. సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కుల, ఆదాయ, నివాస, ఇతర ధ్రువీకరణ పత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఐకెపి ca సమాఖ్య పిలుపుమేరకు దుబ్బాక మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

విజన్ ఆంధ్ర దుబ్బాక రిపోర్టర్ : సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం ఐకెపి సీఏ మండల కమిటీ ఆధ్వర్యంలో జీతాలు పెంచాలని సెర్ప్ ఉద్యోగుల తో పాటు సమానంగా చూడాలని మాకు కనీస వేతనం 18 వేల రూపాయలు ఉండాలని ఉద్యోగ భద్రత కల్పించాలని మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం రానప్పుడు ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు జీతాలు పెంచుతామని 18 వేల వరకు కనీస వేతనం ఉండాలని దుబ్బాకమండలకమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో దుబ్బాక మండలం సిఏలు పోతారం రేణుక.చౌదర్పల్లి హైమావతి ఆకారం జమున జాలిగం బాబు, సత్యపాల్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇన్సెంటివ్ రీవిజనల్ 61 శాతం పూర్తి దోమకొండ తహసిల్దార్ స్వప్న



కామారెడ్డి బ్యూరో జూలై 13( విజన్ ఆంధ్ర): కామారెడ్డి జిల్లా దోమకొండ మండలంలో స్పెషల్ ఇన్సెంటివ్ రీవిజనల్ 61 శాతం పూర్తయిందని గడువులోగా 100 శాతం పూర్తి చేస్తామని దోమకొండ తహసిల్దార్ స్వప్న సోమవారం తెలిపారు. మండలంలో 24512 మంది ఓటర్లు ఉన్నారని ఎన్యుమరేటర్ 24-7-2026 చివరి తేదీ అన్నారు. కొత్త ఓటర్లు నమోదుకు పాము నెంబర్ 6, మార్పుల కోసం పాము నెంబర్8 ఫారం పూర్తి చేసి మార్పులు చేసుకోవచ్చున్నారు. బూ రి సర్వే కు మండలంలో మూడు గ్రామాలు ఉన్నాయని లింగుపల్లి, కుందారం, సీతారాంపల్లి లలో భూ రీ సర్వే పూర్తి చేస్తామన్నారు. దోమకొండ తాసిల్దార్ కార్యాలయం కు నాలుగు సంవత్సరాల నుండి సర్వేయర్ లేకపోవడంతో ఇన్చార్జి సర్వేలతో పనులు నత్తనడకన సాగుతున్నాయని, పూర్తిస్థాయి సర్వేయర్ ఉంటే సమస్యలు ఉండవని వచ్చిన రైతులకు తెలిపారు.

## జూలై 17న జాబ్ మేళా

**- ఎయిర్‌టెల్ ఎక్స్‌స్ట్రీమ్ బ్రాడ్‌బ్యాండ్‌లో 54 ఉద్యోగాలు**

**- జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-13(విజన్ ఆంధ్ర) : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జూలై 17న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌టెల్ ఎక్స్‌స్ట్రీమ్ బ్రాడ్‌బ్యాండ్ సంస్థలోని ఖాళీల భర్తీ కోసం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తులోని రూమ్ నెం.233లో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంస్థలో మొత్తం 54 ఖాళీలు ఉన్నాయని, వీటిలో 23 ఇంజనీర్ పోస్టులు, 23 వైర్‌మెన్ పోస్టులు, 8 సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల ప్రాంతాల్లో నియమిస్తారని వెల్లడించారు. ఇంజనీర్ పోస్టులకు డిగ్రీ లేదా డిప్లొమాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. వైర్‌మెన్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు డిగ్రీ పూర్తిచేసిన 18 నుంచి 34 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ, యువకులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు అప్‌డేట్ చేసిన రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు జిరాక్స్, అనుభవ ధ్రువపత్రం (ఉంటే) వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9908674056, 8985336947, 8121262441 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి తెలిపారు.

## జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం..


### విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 13 (విజన్ ఆంధ్ర బ్యూరో): జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే భావనతో ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి సంవత్సరం రెండుసార్లు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇటీవలే పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని, అలాగే 14 ఏళ్ల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచామని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రానున్న రోజుల్లో వేములవాడ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో తరగతులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. హైదరాబాద్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లకు దీటుగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యున్నత విద్యా సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని, కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆది శ్రీనివాస్ సూచించారు.

## పంటల పై ఎల్ నినో ప్రభావం సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**- జిల్లా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి.సతీష్ చంద్ర**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై 13(విజన్ ఆంధ్ర) ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎల్నినో ప్రభావం వల్ల సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. పెద్దపల్లి జిల్లాలో సాధారణ వర్షపాతం (237.4 మి.మీ) తో పోలిస్తే, ప్రస్తుతం 13 శాతం లోటుతో (206.6 మి.మీ) వర్షపాతం నమోదైనట్లు పంటల సాగులో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి. సతీష్ చంద్ర సోమవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. జిల్లాలో ఇప్పటికే 2 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ఇంకా నాట్లు వేయని రైతులు స్వల్పకాలిక (120 రోజులు) రకాలను ఎంచుకుని, జూలై 15 లోపు నాట్లు పూర్తి చేసుకోవాలని, జూలై 15 తర్వాత నాట్లు వేసే రైతులు తెలంగాణ సోనా( ఆర్ఎన్ఆర్ ) 15048 రకాన్ని నాటుకోవాలని తెలిపారు. పత్తి రైతులు జూలై 20 లోపు విత్తన ప్రక్రియను పూర్తి చేయాలి. మట్టిలో తేమను బట్టి విత్తనం వేయాలి. పత్తిలో బోర్డర్, ఇతర పంటలను అంతర పంటలుగా సాగు చేయడం ద్వారా అదనపు ప్రయోజనం ఉంటుందని అన్నారు. మొక్కజొన్న 90-100 రోజుల స్వల్పకాలిక లేదా 100-110 రోజుల మధ్యకాలిక రకాలు అనుకూలం జూలై 16 నుండి 31 మధ్య నాట్లు పూర్తి చేయాలని , ఇతర పంటలు తక్కువ వర్షపాతానికి అనువైన కంది, పెసర, మినుము, అలసందలు (జొన్నలు, సజ్జలు) వంటి పంటలను ఎంచుకోవాలని, స్వల్పకాలిక పంటలను సాగు చేయడం ద్వారా నీటి ఎద్దడిని తట్టుకోవచ్చు, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సరైన ప్రణాళికతో పంటలు సాగు చేసి, సాగులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు వహించాలని డాక్టర్ బి. సతీష్ చంద్ర కోరారు.

## గొర్రెల యజమానికి రూ, 1 లక్ష 25 వేల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 13,(విజన్ ఆంధ్ర ) : గత వరద పరిస్థితులలో జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో వరద నీటికి కొట్టుకుపోయి మృతి చెందిన గొర్రెలకు సంబంధించి గొర్రెల యజమాని పొనవేని రాజబాబు కు 1 లక్ష 25 వేల రూపాయల నష్టపరిహారం చెక్కును సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కష్టాలను గుర్తించి ఆదుకునే ప్రభుత్వం అని అన్నారు. వరదలో కొట్టుకుపోయి మృతి చెందిన గర్రెలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆ కుటుంబానికి భరోసా కల్పించిందన్నారు. పేదల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్మార్వో రాఫాతుల్లా ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, పార్టీ పట్టణ అధ్యక్షులు తూముల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక భవనం నిర్మాణంలో నాణ్యత పాటించాలి : తోట లక్ష్మీకాంతరెడ్డి



అల్వాల్, జూలై 13,( విజన్ ఆంధ్ర): సామాజిక భవనం నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మల్కాజ్గిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. సోమవారం అల్వాల్ సర్కిల్ రాజీవ్ వీకర్ సెక్షన్ కాలనీ లో నూతనంగా నిర్మాణం అవుతున్న సామాజిక భవనం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సామాజిక భవనం నిర్మాణంలో ఎలాంటి అవకతవకలకు పాలు పడకుండా, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వెంకటేష్ గౌడ్, సత్యనారాయణ, అక్రమ్ పాష , కురుమూర్తి బలవంత రెడ్డి, జ్యోతి యాదవ్, బబిత, లావణ్య, సుకన్య, నీతా గ్లోరీ తదితరులు పాల్గొన్నారు.

## మారుమూల గిరిజన గ్రామాల్లో విద్యా వెలుగులు

**- ట్రైని డిప్యూటీ కలెక్టర్ మురళి చొరవతో రాళ్లాపురంలో చిన్నారులకు అండ**



చర్ల, జులై 13 (విజన్ ఆంధ్ర) : చదువు ఒక్కటే పేదరికాన్ని జయించే ఆయుధమని నమ్మే డిప్యూటీ కలెక్టర్ మద్దినేని మురళి, ఏజెన్సీ ప్రాంతాల్లోని చిన్నారుల భవిష్యత్తు కోసం ప్రత్యేక చొరవ చూపుతున్నారు మారుమూల అటవీ గ్రామాల్లో నివసించే గిరిజన విద్యార్థుల్లో విద్యాభ్యాసంపై ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో ఆయన చేస్తున్న కృషి ఫలిస్తోంది. దీనిలో భాగంగా చర్ల మండలం తిప్పాపురం పంచాయతీ పరిధిలోని రాళ్లాపురం ప్రభుత్వ పాఠశాలలో అభినందనీయమైన సేవా కార్యక్రమం జరిగింది. డిప్యూటీ కలెక్టర్ మురళి ప్రోత్సాహంతో వీఐపీ పోలీస్ అకాడమీ చైర్మన్ అశోక్ తన మిత్రులతో కలిసి పాఠశాల విద్యార్థులకు 30 స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలను అందజేశారు. అలాగే, అదే ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు పలకలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు చేయూత అందించడం ఎంతో సంతోషాన్ని ఇస్తోందని, మురళి గారి సూచన మేరకు తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు, భవిష్యత్తులో కూడా పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు , ప్రభుత్వం విద్యా రంగంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ, దాతలు కూడా ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు, మురళి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సేవా కార్యక్రమాలు మరెంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు, ఈ కార్యక్రమంలో ఎంఇఓ పరిటాల వెంకట రమణ, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు జబీనా , సిడిపిఓ రేవతి, అంగన్వాడీ సూపర్వైజర్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**





వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 13 (విజన్ ఆంధ్ర) : జిల్లాలోని 1 నుంచి 19 సంవత్సరాల వయసు గల ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్ర తీసుకుని జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం నాగవరం శివారులోని ౨+ూఔ=ూ పెద్దమందడి పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్వయంగా మాత్రలు పంపిణీ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగులు పిల్లల ఆరోగ్యాన్ని, విద్యను దెబ్బతీస్తాయని, మాత్ర తీసుకోవడం వల్ల రక్తహీనత నివారణకు దోహదపడుతుందని తెలిపారు. బాలికలు ప్రత్యేకంగా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఏ విద్యార్థి మిస్ కాకుండా ఉపాధ్యాయులు చూసుకోవాలని ఆదేశించారు. నేడు హాజరు కాని వారికి ఈ నెల 20న మాప్‌-అప్ డే లో మాత్రలు ఇస్తామన్నారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. పరిమళ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల పనులు పరిశీలించిన తోట లక్ష్మీకాంత్ రెడ్డి



అల్వాల్, జూలై 13,( విజన్ ఆంధ్ర): ఓల్డ్ ఆల్వాల్ శ్రీ లక్ష్మి నగర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న సి సి రోడ్ల పనులను సోమవారం కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గం ఇన్ ఛార్జ్ తోట లక్ష్మీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శ్రీ లక్ష్మి నగర్ కాలనీలో కాలనీ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు వినతి మేరకు, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహాకా రంతో 51 లక్షలు మంజూరై నాయని, దీంతో మీ కాలనీలో సిసి రోడ్లు నిర్మాణం ప్రారంభమైనాయని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నాణ్యతతో కూడిన విధంగా సరైన విధంగా సీసీ రోడ్డు పూర్తి చేయాలని సూచించారు. కాలనీ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ కాలనీలో సీసీ రోడ్లు మంజూరీ చేయించినందుకు మైనంపల్లి హనుమంత రావుకు కాలనీ వాసులు తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు భాస్కర్ గౌడ్, నారాయణప్ప, రవి, జైపాల్ రెడ్డి, శివరాజ్, నాగన్న, రాము, మనోహర్రావు, లక్ష్మీ నారాయణ, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజ్, కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు కేబుల్ శేఖర్ జిల్లా సెక్రెటరీ భబితా సూర్య కిరణ్, బలవంత రెడ్డి, కృష్ణ గౌడ్, లావణ్య, సుకన్య, అశోక్, దేవేందర్, ప్రవీణ్, మధుసూదన తదితరులు లపాల్గొన్నారు.

## బైకు ను ఢీ కొట్టిన కారు ప్రమాదంలో ఇవకుడు యువకుడు మృతి.



జూలూరుపాడు జులై 14 విజన్ ఆంధ్ర జూలూరుపాడు మండలం సాయిరాం తండా దండుమిట్ట తండాల మధ్య ప్రధాన రహదారి పై ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకుడును కారు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడక్కడే మృతి చెందాడు విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని జూలూరుపాడు మండల ఎస్సై జినత్ కుమార్ బృందం మృతుని ఆధారాలను సేకరించి కొత్తగూడం ప్రాంతానికి చెందిన షేక్ అజీజ్ గా గుర్తించి కేసు ఫైల్ చేసి తర్యాప్తు చేపట్టారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కరించుకుంటే పోరాటాలు ఉధృతం

**- టి డబ్ల్యూ జేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాళ్ళబండి కృష్ణమూర్తి, కటారి కృష్ణ , డివి**

**- కలెక్టరేట్ ముందు టి డబ్ల్యూ జేఎఫ్ నిరసన**





పాల్వంచ ప్రతినిధి జూలై 13(విజన్ ఆంధ్ర) : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీ డబ్ల్యూ జె ఎఫ్ ) నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమం పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాళ్ళబండి కృష్ణమూర్తి, కటారి కృష్ణ. దాసరి వెంకటేశ్వరరావు (డి వి) మాట్లాడారు. ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గత ప్రభుత్వం హామీలు నెరవేర్చడంలో చిత్తశుద్ధి ప్రదర్శించలేదని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా అధికారం లో కి వస్తే రేవంత్ రెడ్డి జర్నలిస్ట్ కు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తామని హామీ ఇచ్చి, నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. జర్నలిస్టుల సేవలను వినియోగించుకుంటున్న ప్రభుత్వాలు, వారి సంక్షేమాన్ని మాత్రం విస్మరించారని ఆరోపించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని, జర్నలిస్టులకు ప్రత్యేకంగా బీమా పథకాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాల ఫలితంగా అక్రిడియేషన్ కార్డులు మంజూరు లో వెసులుబాటు కల్పించడం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉధృతమైన పోరాటం తప్పని హెచ్చరించారు.

***ఐక్య పోరాటాలు చేయాలి. జర్నలిస్టు సంఘాల సంఘీభావం***

రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యల పరిష్కరించడానికి సుముఖత చూపడం లేదని ఈ విషయంలో జర్నలిస్టు సంఘాలు ఐక్యమై పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ఐజేయు జిల్లా ప్రధాన కార్యదర్శి జనుమాల రమేష్ అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి ఆ సంఘం తరపున హాజరై సంఘీభావం తెలిపి మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రధానంగా 1/70 చట్టం అమల్లో ఉన్నదని కుంటి సాకులు చెబుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో అధికార ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం దాటవేసే ధోరణి అవలంబిస్తున్నాయని విమర్శించారు. గిరిజన ప్రాంత చట్టాలకు తూట్లు పొడుస్తూ బడా బిల్డింగులు, హోటల్లో నిర్మిస్తున్న వారికి చట్టం వర్తించదా...? అని ప్రశ్నించారు. కేవలం జర్నలిస్టులకు స్థలాలు ఇవ్వడానికి కుంటి సాకుగా ఈ చట్టాన్ని చూపిస్తున్నారని మండిపడ్డారు. జర్నలిస్టులకు నిలిపివేసిన రైల్వే పాసులు పునరుద్ధరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడియేషన్ కార్డులు ఇవ్వాలని, పాత్రికేయుడుగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

***గత ప్రభుత్వం సంక్షేమనేది ఏర్పాటు చేసింది టెంజు జిల్లా అధ్యక్షులు వట్టికొండ రవి***

బీ ఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టు సంక్షేమ నిధి ఏర్పాటు చేసి, కరోనా సమయంలో కరోనా బాధిత కుటుంబాలను ఆదుకున్నదని టెంజు జిల్లా అధ్యక్షులు వట్టికొండ రవి అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నిరసన కార్యక్రమానికి ఆయన పూర్తి సంఘీభావం ప్రకటించి ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గడచిన రెండున్నర సంవత్సరాల కాలంలో జర్నలిస్టులకు చేసింది ఏమీ లేదని దుయ్యబట్టారు. గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టిన కార్యక్రమాన్ని సైతం కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆరోపించారు. వెంటనే అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి సంఘీభావం పలు జర్నలిస్టు సంఘాలు నాయకులు కురుమల్ల శంకర్ సంఘీభావం తెలిపి ప్రసంగించారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు వనమా శ్రీనివాసరావు, అల్లాడ రమేష్, జి. మధు, జి వేణు మేకల జ్యోతి. కుమ్మరి రమేష్ వెంకటాచారి జయంత్, పివి ఎంఎస్ మూర్తి ,టి డబ్ల్యూ జె ఎస్ నాయకులు కొడాలి వెంకటేశ్వర్లు, వెంకన్న , వేణుగోపాల్, జలాల్, నందిపాటి రమేష్ తదిత రులు పాల్గొన్నారు

# మమ్మేలు స్వామి మల్లన్న....

## పెద్దపట్నం పై కొలువుతీరిన మల్లికార్జున స్వామి...








**- ముగిసిన పెద్దపట్నం మహోత్సవం**

**- ఘనంగా ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి పెద్దపట్నం మహోత్సవం**

**- రంగురంగుల తో ఒగ్గు పూజారులు వేసిన పెద్దపట్నం**

**- స్వామివారిని దర్శించుకున్న భక్తులు**

**- స్వామి సన్నిధిలో అగ్నిగుండం పై నడుస్తున్న భక్తులు**

**- ముగిసిన పెద్ద పట్టణ మహోత్సవం**

ఓదెల జులై 13,(విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్రంలోని ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రాలలో ఓదెల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం ఒకటి. వదల భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఉగాదితో ప్రారంభమై పెద్దపట్నం మహోత్సవం తో ముగుస్తుంది. మల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి ప్రతి ఆదివారం,బుధవారం రోజులతో పాటు మిగతా రోజులలో స్వామివారిని దర్శించుకోవడానికి నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటారు. స్వయంభు గా వెలసిన మల్లికార్జున స్వామి చాలా మహిమగల దేవుడని భక్తుల అపార నమ్మకం. భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా భక్తులు కొలుస్తారు.ఆషాడమాసంలో జరిగే పెద్దపట్న మహోత్సవం ఆదివారం ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు నిత్యోత్సవం, 9 గంటల నుంచి 12:30 వరకు శ్రీ గణపతి పూజ,శివ పుణ్యాహవాచనము అనంతరం రాత్రి 10 గంటలకు ఒగ్గు పూజారులు రంగురంగుల తో పెద్ద పట్నం వేశారు.రంగు రంగులతో వేసిన పెద్ద పట్నంపై స్వామివారు కొలువుతీరారు. కొలువుదీరిన స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ రాష్ట్రాల జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని పెద్ద పట్టణ మహోత్సవాన్ని తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం పెద్దపట్టం పై శివసత్తులు నాట్యం చేస్తూ శివనామస్మరణతో స్వామివారి దర్శించుకుని పసుపు,కుంకుమను దేవుడు ప్రసాదంగా తీసుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారి జీవిత చరిత్రను ఒగ్గు పూజారులు ఒగ్గు కథ రూపంలో చెప్పారు. తెల్లవారుజామున 5 గంటలకు అగ్నిగుండ మహోత్సవంలో భక్తులు పుణ్య స్థానంలో ఆచరించి అగ్నిగుండంపై శివనామస్మరణ చేసుకుంటూ అగ్నిగుండంపై నడిచారు. అగ్నిగుండ మహోత్సవంతో పెద్దపట్నం మహోత్సవానికి ముగింపు పలికారు. ఈ సందర్భంగా ఈవో సదయ్య మాట్లాడుతూ.... పెద్దపల్లి జిల్లాలో అతిపెద్ద సేవ క్షేత్రమైన ఓదెల మల్లికార్జున స్వామి మహిమగల దేవుడని స్వామి దయ వల్ల వర్షాలు సమృద్ధిగా పడి పాడిపంటలు పండాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండేలా భగవంతుని కోరుకున్నట్లు తెలిపారు. స్వామివారిని పెద్దపట్నం అగ్నిగుండ మహోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు స్వామివారి ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.పెద్దపట్నం మహోత్సవం ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సనత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

# బీజేపీ శ్రేణులకు అండగా ఉంటా.. ఎంపీ వైఖరితోనే రాజీనామా డాక్టర్ రఘు

**- డాక్టర్ రఘు బాటలోనే చర్లపల్లి మీన సుఖేందర్ గౌడ్**

**- ఎంపీ అరవింద్ బీజేపీలో ఉన్న కాంగ్రెస్ గుణాలు కలిగిన వ్యక్తి**



మెట్ పల్లి, జూలై 13 (విజన్ ఆంధ్ర): మెట్ పల్లి పట్టణ బీజేపీలో అసంతృప్తి జ్వాలలు ముదిరాయి. గత శుక్రవారం పార్టీకి రాజీనామా చేసిన ముఖ్య నేత డాక్టర్ రఘు సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించగా, ఆయన బాటలోనే 18వ వార్డు కౌన్సిలర్ చర్లపల్లి మీన సుఖేందర్ గౌడ్ కూడా ఈరోజు (సోమవారం) పార్టీకి తమ రాజీనామాను సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ, తాను భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేసినప్పటికీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. పార్టీ మారినంత మాత్రాన కార్యకర్తలకు దూరం కాలేదని, బీజేపీ కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా, ఎలాంటి కష్టం వచ్చినా నిర్భయంగా తన వద్దకు రావచ్చని, ఎప్పటిలాగే అందరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

**స్వలాభం కోసమే కార్యకర్తల వాడుక..**

ఎంపీ ధర్మపురి అరవింద్ వైఖరిపై డాక్టర్ రఘు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ కేవలం తన సొంత స్వలాభం కోసమే పార్టీని, రాత్రింబవళ్లు కష్టపడే కార్యకర్తలను వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తల శ్రమను నాయకులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదన్నారు.

**కౌన్సిలర్ మీన సుఖేందర్ గౌడ్ విమర్శలు**

రాజీనామా అనంతరం కౌన్సిలర్ చర్లపల్లి మీన సుఖేందర్ గౌడ్ మాట్లాడుతూ ఎంపీ అరవింద్ తీరుపై నిప్పులు చెరిగారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఎంపీ అరవింద్ మెట్ పల్లి మీదుగానే కోరుట్ల, జగిత్యాల, రాయికల్ ప్రాంతాలకు వెళ్లారు తప్ప, ఒక్కరోజు కూడా మెట్ పల్లి పట్టణంలో ప్రచారానికి రాలేదని మండిపడ్డారు. స్థానిక మున్సిపాలిటీని, ఇక్కడి నాయకులను ఆయన పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఎంపీ అరవింద్ బీజేపీ పార్టీలో ఉన్నప్పటికీ, ఆయనలో పూర్తిగా కాంగ్రెస్ గుణాలే ఉన్నాయని సుఖేందర్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడుతున్న వారిని కాదని, సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుండడం వల్లే తాము పార్టీని వీడాల్సి వచ్చిందని నేతలు స్పష్టం చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి

**-ప్రతి వినతిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సత్వర చర్యలు తీసుకోవాలి**

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**-ప్రజావాణిలో మొత్తం 50 వినతులు స్వీకరణ**




సంగారెడ్డి బ్యూరో , జూలై:13(విజన్ ఆంధ్ర ) : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, అర్హత మేరకు వేగవంతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.కార్యక్రమానికి హాజరైన అర్జీదారుల సమస్యలను ఓర్పుగా ఆలకించిన కలెక్టర్, ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా ప్రతి ఫిర్యాదుకు సత్వర పరిష్కారం అందించాలని తెలిపారు. ప్రజావాణిలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 50 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు 16, నారాయణఖేడ్ డివిజన్‌కు 4, జహీరాబాద్ డివిజన్‌కు 6, కలెక్టరేట్‌కు 24 దరఖాస్తులు అందగా, అందోల్ డివిజన్‌కు ఎలాంటి వినతులు అందలేదని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీవో, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# వికలాంగ, మహిళ శాఖ తెలంగాణ రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ సత్యనారాయణకు శుభాకాంక్షలు



మల్కాజిగిరి, జూలై 13,(విజన్ ఆంధ్ర): వికలాంగ, మహిళ, శిశు ,వయోవృద్ధుల, తర్డ్ జెండర్ శాఖ తెలంగాణ రాష్ట్ర కమిషనర్ అండ్ డైరెక్టర్ గా నూతనంగా నియమితులైన ఎస్. సత్యనారాయణ సోమవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి మేడ్చల్ (వీహెచ్ పీ) మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎన్.వినయ్ ఆయనను, మలక్ పేటలోని ఛాంబర్ లో కలిసి శాలువా తో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవి పురుషులకే ఇస్తున్నారని ,ఆ పదవిని వికలాంగ మహిళలకు ఇవ్వాలని కోరారు. వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, జి.ఓ ప్రకారం వికలాంగులకు 5% ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. వికలాంగులకు రూ. 6000/- తక్షణమే మంజూరు చేయా లన్నారు. బడ్జెట్లో విడుదల చేసిన నిధుల నుండి వికలాంగులకు రూ 1 లక్ష నుండి ఐదు లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. దీనికి డైరెక్టర్ అండ్ కమీషనర్ సానుకూలంగా స్పందించారని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయేలా చర్యలు తీసుకుంటానని వినయ్ తెలిపారు.

## ప్రజావాణిలో 114 దరఖాస్తులు స్వీకరణ

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



కామారెడ్డి బ్యూరో జులై 13(విజన్ఆంధ్ర) : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 114 దరఖాస్తులను స్వీకరించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులను కలెక్టర్ స్వయంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, వాటిని ప్రాధాన్యతతో పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం పెండింగ్ దరఖాస్తుల పై ఆరా తీశారు. తహసీల్దార్ లు, ఆయా శాఖల అధికారులు ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులతో పాటు, ఆయా సంక్షేమ, అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండరాదని కలెక్టర్ సూచించారు.

# ములుగు జిల్లా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, జీవనభృతి కల్పించాలి

**- టీడబ్ల్యూజేఎఫ్**




ములుగు జూలై 13,విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం అన్ని జర్నలిస్టు సంఘాల మద్దతు తో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టిడబ్ల్యూజే ఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యలపై జిల్లా కలెక్టర్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిటిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవుల వెంకన్నబి మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చినా ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. చాలీచాలని జీతాలతో ఇబ్బంది పడుతున్న అర్హులైన జర్నలిస్టులకు నెలవారీ జీవనభృతి అందించి, ఉచిత బస్ పాసులు ఇవ్వాలి గతంలో ఉన్న రైల్వే పాసుల సౌకర్యాన్ని పునరుద్ధరించాలనీ, అక్రిడిటేషన్ & హెల్త్ కార్డులు మంజూరు చేసి , జర్నలిస్టుల పిల్లలకు యూకేజీ నుండి పీజీ వరకు అన్ని విద్యాసంస్థల్లో రాయితీలిచ్చి , మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ కల్పించాలన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిటిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ బుచ్చిరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు ఎం. సంపత్, సి.హెచ్. రాజవర్ధన్, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షులు ముంజాల బిక్షపతి గౌడ్, బంజారా నాయకులు బబ్లు నాయక్, కమ్యూనిస్టు నాయకులు నటరాజ్, భాషా తదితరులు పాల్గొన్నారు.

# మంత్రులకు ఘన స్వాగతం



ములుగు జూలై 13, విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గల సమక్క సాగర్ ప్రాజెక్ట్ వద్దకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర మంత్రులకు అధికారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పి.ఓ. లెనిన్ వస్సల్ టోప్పో లు పుష్ప గుచ్చాలు ఇచ్చి స్వాగతించారు.

# దేవాదుల ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం

**- 38.16 టీఎంసీల సామర్థ్యాన్ని వినియోగిస్తాం**

**- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



ములుగు జూలై 13, విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్టును మంత్రుల బృందం పరిశీలించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లకు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావ , ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్‌లి తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్, మోటార్ల పనితీరు, ఎత్తిపోతల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ....... ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులకు సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. గోదావరి జలాలను గరిష్ఠంగా వినియోగించి చెరువులు నింపడం, భూగర్భ జలాలు పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 38.16 టీఎంసీలు అని, దీనిని పూర్తిగా వినియోగించి 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టులోని 10 పంపుల్లో 7 పంపులు పనిచేస్తున్నాయని, రెండు రోజుల్లో అన్ని పంపులు అందుబాటులోకి వస్తాయన్నారు. 22 రిజర్వాయర్లను పూర్తిగా నింపేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రాజెక్టు పనులకు సంబంధించిన రూ.194 కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. భూసేకరణను కూడా వేగంగా పూర్తి చేస్తామన్నారు. దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం నిర్దేశించారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శ్రీహరి, కె.ఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 13 (విజన్ ఆంధ్ర) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించి ఫిర్యాదుదారునికి సమాచార ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతి పత్రాలు స్వీకరించారు. ఈసందర్భంగ కలెక్టర్ అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి అట్టి సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదు దారునికి పంపించటమే కాకుండా ఆన్లైన్ లో పెట్టాలని ఆదేశించారు. ఒకవేళ ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలో లేనిది అయితే సంబంధిత శాఖకు లేఖ రాస్తూ పంపించాలని తెలియజేశారు. పరిష్కరించలేని అంశం ఏదైనా ఉంటే పై అధికారులకు పంపించడం లేదా ఏ నిబంధన ప్రకారం పరిష్కారం చేయలేమో ఫిర్యాదు దారునికి తెలియజేయాలి తప్ప తమ వద్ద పెండింగ్ లో పెట్టుకోవద్దని సూచించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి నుంచి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను సైతం సత్వరమే పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో 60 దరఖాస్తులు వచ్చాయి. ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 9 దరఖాస్తులు వచ్చాయి. నేటి ప్రజావాణిలో జెడ్పి సీఈవో యాదయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎన్. తిరుపతయ్య, శిక్షణ ఉప కలెక్టర్లు మేడం శ్రావ్య, రజనీకాంత్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# "జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం" ప్రారంభం.

**- ములుగు జిల్లాను నులిపురుగుల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం**

**- డి ఎం హెచ్ ఓ డా. గోపాల్ రావు**

ములుగు జూలై 13 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : సోమవారం ములుగులోని జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతులు సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. గోపాల్ రావు మాట్లాడుతూ నులి పురుగులు పిల్లల పోషకాహారాన్ని తినడం వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక మరియు మానసిక ఎదుగుదల లేకపోవడం, పాఠశాలకు రాకపోవడం వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, మల మూత్ర విసర్జనకు వెళ్ళినప్పుడు పాదరక్షలు ధరించడం, శుభ్రమైన త్రాగు నీరు త్రాగడం ద్వారా నులిపురుగులను నిరోధించవచ్చునని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ములుగు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు మరియు అంగన్వాడి సెంటర్లలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్త్రీ శిశు సంక్షేమ శాఖతో పాటు విద్యాశాఖ, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్నామన్నారు. ములుగు జిల్లాను నులిపురుగుల రహిత జిల్లాగా చేయడానికి వైద్యారోగ్య శాఖ కృషి చేస్తుందని వివరించారు.



జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. నాగ అనేష్....

మాట్లాడుతూ 13వ తేదీని జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంగా, ఆ రోజు హాజరుకాని విద్యార్థులకు 20వ తేదీన "మాప్-అప్ డే" గా నిర్వహిస్తున్నామన్నారు. 1-2 సంవత్సరాల పిల్లలకు 1/2 టాబ్లెట్ చూర్ణాన్ని నీటిలో కలిపి, 2-3 సంవత్సరాల వారికి 1 టాబ్లెట్ చూర్ణం చేసి, 4-19 సంవత్సరాల వారికి 1 టాబ్లెట్ చప్పరించి నమిలి మింగాలని వివరించారు. ములుగు జిల్లాలో 73,444 మంది పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను ప్రత్యేక కార్యాచరణతో పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి సంపత్, తెలంగాణ రెసిడెన్షియల్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ బి. నర్మదా బాయ్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్. స్వాతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు,ఆర్.బి.ఎస్.కే డాక్టర్లు మల్లికార్జున్, శ్రీలత పదోతర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి**

**- జూలై 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొత్తకోట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవం**

**- అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన దేవరకద్ర ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఎస్పీ**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 13 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. జూలై 15న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తకోట పట్టణంలో పర్యటించి నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి, విద్యాశాఖ అధికారులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని, ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రూ. 1.77 కోట్ల సీఎస్ఆర్ నిధులు, దాతల సహకారంతో కొత్తకోట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, రూ. 33. 50 లక్షల వ్యయంతో పీఎం శ్రీ కింద లైబ్రరీ, సైన్స్ ల్యాబ్ నూతన భవనాల నిర్మాణాన్ని పూర్తిచేసి, జూలై 15న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గతంలో ఈ పాఠశాలలో బాలికలు తగిన సౌకర్యాలు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ చదువుకున్నారని, ప్రస్తుతం ఆధునిక వసతులతో కూడిన భవనం అందుబాటులోకి రావడం విద్యార్థినులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి నియోజకవర్గంలో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్"లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికల్లా ఈ పాఠశాలలు పూర్తై సుమారు 2,500 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఇతర వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక ల్యాబ్‌లు, డిజిటల్ ప్యానెల్ బోర్డులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత విద్యను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు. జూలై 15న ముఖ్యమంత్రి ముందుగా మహబూబ్‌నగర్‌లోని అమరరాజా సంస్థ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం మధ్యాహ్నం కొత్తకోటకు చేరుకుని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం విద్యార్థులతో ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించి, ప్రభుత్వ విద్యలో తీసుకొస్తున్న సంస్కరణలు, భవిష్యత్ కార్యాచరణపై వారితో మాట్లాడనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నందున రాజకీయ ప్రసంగాలకు తావు లేకుండా విద్యా అంశాలకే ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరగడంతో గత ఏడాదితో పోలిస్తే విద్యార్థుల ప్రవేశాలు కూడా గణనీయంగా పెరిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏఎస్పీ వీరారెడ్డి, జెడ్పి సీఈవో యాదయ్య, జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**- కొత్తకోట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవం, విద్యార్థులతో ముఖాముఖి విజయవంతం చేయాలి**


**- అధికారుల సమీక్షా సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఎస్పీ సునీతా రెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి,జులై 13 (విజన్ ఆంధ్ర) : జులై 15న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తకోట పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ముఖ్యమంత్రి కొత్తకోట పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డితో కలిసి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమంతో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడనున్నారని తెలిపారు. కార్యక్రమం జరిగే ప్రాంగణంలో బారికేడ్లు, వేదిక, సౌండ్ సిస్టమ్, విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి విద్యార్థులతో నిర్వహించే ముఖాముఖి సంభాషణ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని సాంకేతిక ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే 9, 10వ తరగతి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కూర్చునే ఏర్పాట్లు, కార్పెట్లు, తరగతి గదుల్లో ఫర్నిచర్, తాగునీరు, అల్పాహారం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.విద్యార్థుల రాకపోకలు, వారి నిర్వహణకు ప్రత్యేక బృందాలను నియమించి, కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం సమయంలో ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి పోలీసు బందోబస్తుపై అధికారులకు దిశానిర్దేశం చేస్తూ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, వీఐపీ రూట్, ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అనంతరం సీఎం హెలికాప్టర్ ల్యాండ్ అయ్యే హెలిపాడ్ ప్రదేశాన్ని సందర్శించి అక్కడ భద్రత ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. బారికేడ్ల విషయంపై ఆర్ అండ్ బి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, జెడ్పి సీఈవో యాదయ్య, ఆర్ అండ్ బి అధికారి దేశ్యా నాయక్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# "ఎక్సలెంస్ అవార్డు " అందుకున్న కోలా రవీందర్

హైదరాబాద్ జులై 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్) : ప్రముఖ సాంస్కృతిక, సామాజిక సంస్థ "సృజన ఆర్ట్ క్రియేషన్స్" కార్యదర్శి ఎం.రాజేష్ ఆధ్వర్యంలో 'సకల కళా సమ్మేళనం' కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య వేడుకలా నిర్వహించారు. ఆదివారంనాడు దిల్సుఖ్ నగర్, బాబు జగ్జీవన్ రామ్, ఆడిటోరియంలో ఏర్పాటు చేసి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్. వేణుగోపాల చారి మాజీ కేంద్రమంత్రి హాజరై వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖులకు 2026 సంవత్సరం "ఎక్సలెంట్ అవార్డ్స్" ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సామాజిక పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ ను సంస్థ వారు ఎంపిక చేసి అతిథుల చేతుల మీదుగా "ఎక్సలెంట్ అవార్డ్ 2026" ప్రధానం చేసి సత్కరించి ప్రశంశలు శుభాకాంక్షలు అందజేశారు. ఈ సంధర్భంగా కోలా రవీందర్ స్పందిస్తూ, పర్యావరణ పై, నీటి పొదుపు పై, ప్రతి ప్లాటులో ఇంకుడు గుంతలు ఇంజక్షన్ బోర్ ఉండాలని, ప్లాస్టిక్ నివారించాలని, చిన్నపిల్లలకు ఈతపై




అవగాహన కల్పించాలని తాను చేస్తున్న ఉద్యమ పోరాటాన్ని గుర్తించి ఈ ఎక్సలెంస్ అవార్డ్ ను అందజేసినందుకు తనకెంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ అవార్డు అందుకోవడంతో తనలో సేవభావం పై బాధ్యత మరింతగా పెరిగిందని భావిస్తునానన్నారు. మునుముందు కూడా తన సాయ శక్తులా ప్రజలకు సేవ చేస్తానని సామాజిక కార్యక్రమాలలో మరింత విస్తృతంగా పాల్గొంటానని సేవలందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజేంద్ర కుమార్ పూనా ఆర్టిస్ట్, డాక్టర్ సముద్రాల శ్రీదేవి, డాక్టర్ భాగ్యలక్ష్మి రెడ్డి, మరియు వీర భోగ వసంతరాయులు ప్రజా ప్రతి, పాల్గొన్నారు.

# వెంకటాపూర్ మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి



ములుగు జూలై 13, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట, బూర్గుపేట గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఆర్డీవో, ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, బీఎల్ఓ యాప్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత బీఎల్ఓ లకు ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించి కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, సవరణలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ మండల తహసిల్దార్ గిరిబాబు, డిప్యూటీ తహసిల్దార్ భవాని ప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ నితీష్, బి.ఎల్.ఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాలకార్మిక రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**- డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి. కృష్ణయ్య**

**- చెన్నారంలో చట్టాలపై అవగాహన సదస్సు**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 13 (విజన్ ఆంధ్ర) : బాల కార్మికులను బడిలో చేర్పించి బాల కార్మికుల రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలి అని డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి కృష్ణయ్య అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి శ్రీమతి జి. కళార్చన గారి ఆదేశాలనుసారశీ సోమవారం వనపర్తి జిల్లా చెన్నారం గ్రామంలో మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ బాల బాలికలను చదివించి వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయాలని కోరారు. అదేవిధంగా 18 సంవత్సరాల లోపు బాలికకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరం అని తెలియజేశారు. తల్లిదండ్రుల సంరక్షణ చట్టం, మోటార్ వాహనాలు చట్టం గురించి వివరించారు మరియు ఉచిత న్యాయ సలహాలు పొందడానికి వన్ ఫైవ్ వన్ డబల్ జీరో టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని సూచించారు.కార్యక్రమాలలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్స్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'సకల కళా నీరాజనం' లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన "అశోక్" మిమిక్రీ




హైదరాబాద్ జులై 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : ప్రఖ్యాత రచయిత, కవి 'బంకిం చంద్ర చటర్జీ రాసిన 'వందే మాతరం' జాతీయ గీతం 150 ఏళ్ల ఉత్సవాలను పురస్కరించుకొని ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ 'సర్వ కళాకారుల సంక్షేమ వేదిక' ఆధ్వర్యంలో నిర్వహించి న 'సకల కళా నీరాజనం' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శనివారం సాయంత్రం సూరవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ లోని నందమూరి తారక రామారావు ఆడిటోరియం, నాంపల్లి, హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నాగరానికి చెందిన వివిధ సాంస్కృతిక సంస్థల అధ్యక్షులు , కార్యదర్శులు, సభ్యులు, కళాకారులు పాల్గొని తమ సాంస్కృతి కళా ప్రదర్శనలతో ప్రేక్షకుల హృదయాలను దోచుకున్నారు. ఈ కార్యక్రమంలో గత 30 సంవత్సరాలుగా ఎన్నో వేల కార్యక్రమాలలో ప్రేక్షకులను తన మిమిక్రీ తో సమ్మో హితులను చేస్తూ ఆకర్షిస్తున్న నాగరానికి చెందిన సుప్రసిద్ధ మిమిక్రీ కళాకారుడు, ధ్వని అనుకరణ సామ్రాట్, బహుముఖ ప్రజ్ఞాశాలి, మధుర గల సంపన్నుడు 'మిమిక్రీ అశోక్ ' తన అద్భుతమైన గళంతో ఎంతోమంది ప్రముఖ వ్యక్తుల కంఠాలను మధురంగా, శ్రవణానందకరంగా మిమిక్రీ చేసి సభికులను, ప్రేక్షకులను అలరించారు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు, అందరి ప్రశంశలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమ నిర్వాహకులు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులను గౌరవించి 'వందే మాతరం' జాతీయ గీతం 150 ఏళ్ల ఉత్సవ ప్రశంసా పత్రాలను మోమెంటోలను అందజేసి సత్కరించారు. తన మిమిక్రీ తో అపూర్వ ఆధరణ, అభినందనలు అందుకున్న మిమిక్రీ అశోక్ ను ఈ సందర్భంగా 'సర్వ కళాకారుల సంక్షేమ వేదిక' సభ్యులు ఘనంగా సత్కరించి మోమెంటోను, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సంధర్భంగా ఇతర కళాకారులను వారు సత్కరించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా చూడాలి

**- బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సూచన**



అల్వాల్, జూలై 13,( విజన్ ఆంధ్ర): అనవసరంగా ఎవ్వరి ఓటు తొలగించ వద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు నమోదు జరిగేలా చూడాలని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే కనకారెడ్డి నివాసంలో అల్వాల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సర్' ప్రక్రియ అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హజరైనారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...పార్టీ నాయకులు,బీఎల్ ఏలు, బీఎల్ఓ లతో కలిసి ప్రతి ఇంటీ ఇంటికి వెళ్లి ఓటింగ్ మాపింగ్ చేయాలని సూచించారు. చనిపోయిన వారి ఓటరును తీసి వేయాలని, మైనారిటీ ఓటర్లు భయభ్రాంతులకు కాకుండా చూడాలని, పంజాబ్, బెంగాల్ వారి సహకారాలతో వారి ఓటు నమోదు చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నందికంటి శ్రీధర్, నేమూరి శ్రీధర్ గౌడ్, డోలి రమేష్, నరేందర్ రెడ్డి, శరణ్ గిరి, లింగారెడ్డి, మహేష్, రహమత్ ఖాన్, సాజిద్, వీణ మాధవి తదితరులు పాల్గొన్నారు.

# బైక్ చోరుల అంతర్రాష్ట్ర ముఠా బట్టబయలు

-పేట్-బషీరాబాద్ పోలీసుల వలలో ముగ్గురు నిందితులు
-ఇద్దరు నిందితులు, ఇద్దరు బాల నిందితులు పరారీలో
-21 ద్విచక్ర వాహనాలు, ఎర్టిగా కారు సహా చోరీ పరికరాల స్వాధీనం
-19 కేసుల్లో ప్రమేయం అంగీకరించిన నిందితులు
-సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో కేసు ఛేదించిన ప్రత్యేక బృందాలు
-కేసు ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించిన డీసీపీ ఎన్. కోటి రెడ్డి




పేట్ బషీరాబాద్, జూలై 13 (విజన్ ఆంధ్ర): తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేర ముఠాను పేట్-బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి మరో కీలక విజయాన్ని నమోదు చేశారు. మైసమ్మగూడ అపారెల్ పార్క్ సమీపంలో ప్రత్యేక నిఘా నిర్వహించిన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు నిందితులు, ఇద్దరు బాల నిందితులు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితులను న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో నిందితులు పరస్పరం ముఠాగా ఏర్పడి, లక్ష్య ప్రాంతాలకు కారులో చేరుకుని, పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపిన ద్విచక్ర వాహనాలను మాస్టర్ కీల సాయంతో చోరీ చేసి వేగంగా అక్కడి నుంచి పరారవుతున్నట్లు తేలింది. ఈ ముఠా ఇప్పటివరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి 21 ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. విచారణ సందర్భంగా 19 కేసుల్లో తమ ప్రమేయాన్ని నిందితులు అంగీకరించినట్లు అధికారులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి 21 మోటార్ సైకిళ్లు, ఒక సుజుకి ఎర్టిగా కారు, మూడు మొబైల్ ఫోన్లు, రెండు మాస్టర్ కీలు, రెండు కట్టర్లు, రెండు స్క్రూడ్రైవర్లు, ఐదు ఎలక్ట్రికల్ స్విచ్‌లు స్వాధీనం చేసుకున్నారు. చోరీలకు వినియోగించిన పరికరాలతో పాటు వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకోవడం కేసు దర్యాప్తులో కీలక మలుపుగా మారింది. ఈ కేసును అదనపు డీసీపీ పురుషోత్తం మార్గదర్శకత్వంలో, ఏసీపీ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలు ఛేదించాయి. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారాన్ని సమన్వయం చేసి నిందితుల కదలికలను గుర్తించి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. శాస్త్రీయ దర్యాప్తు, క్షేత్రస్థాయి సమాచార సేకరణతో స్వల్ప వ్యవధిలోనే కేసును ఛేదించడం విశేషమని అధికారులు పేర్కొన్నారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన పేట్-బషీరాబాద్ పోలీసు బృందాన్ని కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, ఐపీఎస్ అభినందించారు. నేరాల నియంత్రణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి తగిన గుర్తింపు కల్పిస్తామని ఆయన తెలిపారు. ప్రజలు తమ వాహనాలను భద్రంగా పార్క్ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

- డీసీఆర్బీ డీఎస్పీ : బాలాజీ నాయక్



వనపర్తి జిల్లా ప్రతినిధి,జులై 13 (విజన్ ఆంధ్ర) :మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే విద్యార్థుల విజయానికి తొలి మెట్టని డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్ అన్నారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాలతో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వనపర్తి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు యాంటీ డ్రగ్ సోల్జర్ సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలు, పతకాలు అందజేశారు. డీఎస్పీ బాలాజీ నాయక్, ఎస్సై అంజాద్, ప్రిన్సిపాల్ నవీన, వైస్ ప్రిన్సిపాల్, ఈగల్ పార్టీ డీఎస్పీ బుచ్చయ్య పాల్గొన్నారు. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, ప్రతి విద్యార్థి సమాజంలో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. విద్యార్థినుల భద్రతకు పోలీసు శాఖ అండగా ఉంటుందని, ర్యాగింగ్, వేధింపులు జరిగితే 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 400 మంది విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చింతల హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 13 (విజన్ ఆంధ్ర) : ఆషాఢ మాసంలోని అత్యంత పవిత్రమైన ముహూర్త శైవయోగం సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఆదివారం వనపర్తి పట్టణంలోని చింతల హనుమాన్ ఆలయంలో ఉన్న పరమశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.జూలై 13న ఏర్పడిన ఈ శైవయోగం అత్యంత విశిష్టమైనదని, ఈ రోజున పరమశివునికి అభిషేకం, అర్చనలు నిర్వహించడం వల్ల సకల పాపాలు తొలగి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఆ పరమశివుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుబ్బాక పట్టణంలోని ధర్మాజీపేట 8వ వార్డులో బూత్‌ల సందర్శన



దుబ్బాక విజన్ ఆంధ్ర రిపోర్టర్ ౦: దుబ్బాక పట్టణ పరిధిలోని ధర్మాజీపేట 8వ వార్డులో భారతీయ జనతా పార్టీ కౌన్సిలర్ మెరుపుల సాయికుమార్ గౌడ్ దిశా బోర్డు సభ్యులు సుంకోజు ప్రవీణ్ కుమార్ పార్టీ నాయకులు రంజిత్ రెడ్డి తో కలిసి వార్డులోని వివిధ బూత్‌లను సందర్శించి, సంబంధిత దీూాలను కలిసి ఓటరు జాబితా మరియు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం 8వ వార్డులోని పలు ఇండ్లను సందర్శించి, ఓటర్లను కలిసి ఓటరు నమోదు, వివరాల సవరణ, ఓటు హక్కు వినియోగం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, పార్టీ కార్యకర్తలతో కలిసి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు.

# ఉమ్మడి పాలమూరు గురుకులాల్లో ఫుడ్ పాయిజన్

## బాధ్యత ఎవరిది? ప్రభుత్వానిదా? అధికారులదా?

- గతంలో ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా గురుకులాల్లో చోటు చేసుకున్న ఫుడ్ పాయిజన్ లు..
- -తాజాగా మళ్లీ మన్ననూర్ లో ఫుడ్ పాయిజన్..
- ఒకే రకం బియ్యం ఇవ్వడం లేదన్న ఆరోపణలు....
- బాయిల్డ్ రైస్ బాగుంటుంది అంటున్న ప్రిన్సిపాల్స్, విద్యార్థులు...
- కొరవడిన అధికారుల తనిఖీల కొరత...



రెండు రోజుల క్రితం ఫుడ్ పాయిజన్ తో ఆసుపత్రి పాలైన మన్ననూరు (మున్ననూరు)విద్యార్థులు...

**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,జూలై 14 (విజన్ ఆంధ్ర):** ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు గురుకుల పాఠశాలల్లో వరుసగా చోటుచేసుకుంటున్న ఫుడ్ పాయిజన్ ఘటనలతో తల్లిదండ్రుల్లో, విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కలుషిత ఆహారం తిన్న విద్యార్థులు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో ఆసుపత్రుల పాలవుతున్నారు. గతంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లోని పలు గురుకులాల్లో ఈ సమస్య నెలకొంది. ఇదే తరహాలో గత రెండు రోజుల క్రితం చెంచుల ప్రత్యేక పాఠశాల అయిన నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం మన్ననూర్ పీటీజీ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ నెలకొంది. ఈ ఘటనలో కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురై అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రి పాలయ్యారు.

### ఫుడ్ పాయిజన్‌కు అసలు కారణం ఏమిటి?

ఫుడ్ పాయిజన్ కు అసలు కారణం ఏమిటి.. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలా? లేక స్థానిక గురుకుల అధికారులు, జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యమా? అనే ప్రశ్నలు ఇప్పుడు ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. బియ్యం విషయంలోనే అసలు సమస్య వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలోని అన్ని గురుకులాలకు ఒకే రకమైన బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో పరిస్థితి వేరుగా ఉందని కొందరు గురుకుల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కొన్ని గురుకులాల్లో నీటి కొరత తీవ్రంగా ఉందని చెబుతున్నారు.

### “మాకు సరఫరా అయ్యే బియ్యం నాణ్యత సరిగా లేదు..

గురుకులాల్లో సరఫరా చేసే రైస్ సరిగ్గా లేక ఇబ్బంది ఏర్పడుతుంది అని, బాయిల్డ్ రైస్ అయితే అన్నం బాగా ఉంటుందని విద్యార్థులు అంటున్నారు. బాయిల్డ్ రైస్ ఉడికించినా గింజ గింజ విడిగా ఉంటుంది, త్వరగా పాడవదు. కానీ ఇప్పుడు ఇస్తున్న ఇతర రకం బియ్యం ఉడికించగానే ముద్దలా అయిపోతుంది. దాన్ని పిల్లలు తినలేకపోతున్నారు. అలాగే ఎక్కువసేపు ఉంచితే త్వరగా పులిసిపోయి ఫుడ్ పాయిజన్‌కు దారితీస్తుంది కొన్ని గురుకులాల ప్రిన్సిపాల్స్ తెలిపారు. అన్ని గురుకులాలకు ఒకే రకం బియ్యం ఇవ్వకపోవడం, సరఫరాలో అసమానతలు ఉండడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కొన్ని గురుకులాల్లో మాత్రమే ఎందుకు ఈ సమస్యలు వస్తున్నాయి అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనికి సమాధానంగా స్థానిక స్థాయిలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. గురుకులాల్లో వంటగదుల్లో పరిశుభ్రత లేకపోవడం, బియ్యం, కూరగాయలను సరిగా నిల్వ చేయకపోవడం, వండిన ఆహారాన్ని గంటల తరబడి బయట ఉంచడం, ఫ్రిజ్ సౌకర్యాలు లేకపోవడం వంటి కారణాల వల్ల ఆహారం కలుషితమవుతోందని కొందరు అధికారులే అంగీకరిస్తున్నారు. వార్డెన్లు, కుక్‌లు ప్రతిరోజు ఆహార నాణ్యతను తనిఖీ చేయడం లేదు. జిల్లా గురుకుల అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయకపోవడం వల్లే ఈ నిర్లక్ష్యం పెరిగిపోయిందని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

### ఘటనల వివరాలు

కొన్ని నెలల క్రింద ఉమ్మడి పాలమూరుకు సంబంధించి నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఒక గురుకులంలో 40 మంది, వనపర్తిలో 25 మంది, మహబూబ్‌నగర్‌లోని మరో గురుకులంలో 30 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. వారందరినీ వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ, వరుస ఘటనలతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.



ఫుడ్ పాయిజన్ తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు,పోలీస్ అధికారులు....

### అధికారుల స్పందన

ఈ ఘటనలపై సంబంధించిన జిల్లా అధికారులు మాట్లాడుతూ, ప్రతి గురుకులం నుండి ఆహార నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నామని, బియ్యం నాణ్యతతో పాటు వంట, నిల్వ ప్రక్రియలపై కూడా విచారణ జరుపుతున్నామని చెప్పారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇకపై ప్రతి వారం అధికారులతో తనిఖీలు చేయిస్తామని హామీ ఇవ్వడం వరకే సరిపోతుంది తప్ప అమలు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మళ్ళీ ఫుడ్ పాయిజన్ అయితే గాని అధికారులలో చలనం రావడం లేదనే బలమైన విమర్శలు వస్తున్నాయి..

### తల్లిదండ్రులు, విద్యార్థుల డిమాండ్

“మా పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రభుత్వం వెంటనే అన్ని గురుకులాలకు మంచి రైస్ సరఫరా అయ్యేలాగా చేయాలి. వంటగదుల్లో జజుఎ లు పెట్టాలి. ప్రతి రోజు అధికారులు తనిఖీ చేయాలి“ అని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ అన్నం తినడానికి భయంగా ఉంది. మాకు మంచి భోజనం కావాలి అని కోరుతున్నారు.

### ప్రతిపక్షాల విమర్శలు

ఈ ఘటనలను ప్రతిపక్షాలు చేతులెత్తి చూపుతున్నాయి. “గురుకులాలు అంటే పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల కోసం. వారి విషయంలోనే ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. సరఫరాలో అవినీతి, స్థానికంగా పర్యవేక్షణ లేకపోవడమే ఈ దుస్థితికి కారణం“ అని విమర్శించాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో జరుగుతున్న ఈ ఫుడ్ పాయిజన్ ఘటనలు ప్రభుత్వానికి ఒక హెచ్చరిక. బియ్యం సరఫరా నుండి వంటగది పరిశుభ్రత వరకు ప్రతి అంశంపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. లేకుంటే విద్యార్థుల ఆరోగ్యం ప్రమాదంలో పడమే కాకుండా, గురుకులాలపై ప్రజల విశ్వాసం సన్నగిల్లుతుంది.

# అక్రమ నిర్మాణాలకు అనుమతు ఫుల్లు - తనిఖీలు నిల్....!

- అనుమతులు వేరు, వారి నిర్మాణాలు మరో తీరు.... .
- తనిఖీలు చేయకుండానే అనుమతులిస్తున్న పంచాయితీఅధికారులు . ...!
- అధికారులకు సమాచారం అందిన మీనావేషాలు వేస్తున్నారంటు ఆరోపణలు....

సిద్దిపేట జూలై 13 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట గ్రామ పంచాయితీ అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయి. ఆన్ లైన్ డిజిటల్ సేవలు అందిస్తున్నామని ఉన్నతాధికారులు చెప్తున్న, అక్రమ నిర్మాణాలను చెక్ పడడం లేదు. అధికారుల పర్యవేక్షణలో , బాధ్యత యూతంగా లేకపోవడమే అక్రమ నిర్మాణాలు అధికమైన్నాయి. నిర్మాణ దారుడు స్థానిక ప్రజా ప్రతినిధులను మొదలుకొని గ్రామ స్థాయినుండి మండల స్థాయి అధికారుల వరకు దండిగానే ముట్టజెప్పినట్లు ప్రజారోపణలు



వ్యవసాయ క్షేత్ర భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం

వినిపిస్తున్నాయి. కనుక అధికారులు అక్రమ నిర్మాణంపై తీసుకోవలసిన చర్యల్లో నిర్లక్ష్యం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. దీన్నే నిర్మాణ దారుడు ఆసరా చేసుకొని అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలను మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. .. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం, కొండపాక మండల పరిధిలోని వెలికట్ట ఆరెపల్లి శివారు భూములన్ని రాజీవ్ రహదారికి అనుకోని ఉండడం వల్ల అక్రమ నిర్మాణ దారులు పెట్రేగి పోతున్నారు అనడానికి నిదర్శనం, సిద్దిపేట నుండి హైదరాబాద్ కు వెల్లే ప్రధాన మైన రహదారికి సమీపంలో వెలిసిన నిర్మాణనే చూడొచ్చు అధికారుల చేతివాటం ఏవిదంగా పనిచేస్తుందో చూస్తేనే అర్థమౌతుందంటున్నారు ప్రజలు. చేసేది ప్రభుత్వ ఉద్యోగులైన ఆ అధికారులు అక్రమ నిర్మాణ దారులకు చెప్పే తిరులో తేడావుంది, అధికారం మనదే కనుక బిల్డింగ్ నిర్మాణ స్థలాన్ని బట్టి ప్రభుత్వ అనుమతులు వచ్చేంత వరకు నిరీక్షణ లేకుండా పనులను వేగవంతంగ ప్రారంభించే విదంగా ప్రోత్సహించి ప్రభుత్వ ఆదాయానికి గండిపడేలా వ్యవహరిస్తున్నారు కొంతమంది అధికారులు ఇలా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలవైపు, ఉన్నంతధికారులు అధికారులు ఒక్కసారైనా పర్యవేక్షించక పోవడం గమనార్హం. అధికారుల చేతివాటం ఒకతీరైతే మరోపక్క స్థానిక అధికార ప్రజాప్రతినిధులకు, వారి అనుచరులకు అధికారపార్టీ మంత్రుల అండదండలు మనకు ఉన్నంతవరకు మనం అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడంలో తప్పెందన్నట్లుగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో ప్రధాన కూడలైన వెలికట్ట చౌరస్తా నుండి ఇటు జనగాం వెల్లే రోడ్డుకు కొన్ని వెలుస్తే మరికొన్ని హైదరాబాద్ రోడ్డుకు అనుమతులకు మించిన అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

*-: ఆన్ లైన్ సిస్టం వచ్చినా, చెక్ పెట్టడంలో విఫలమైతున్న అధికారులు...!*

ఆఫ్ లైన్ పర్మిషన్ లేట్ అవుతుందని వేగంగా పర్మిషన్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆన్ లైన్ విదానాన్ని అమల్లోకి తెచ్చి యేండ్లు గడుతున్న అధికారులు పారదర్శకతతో కొనసాగించకుండా అక్రమ నిర్మాణదారులకు కొమ్ముకాయడం చూస్తుంటే బాగానే చేతివాటం చూపిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి అని ప్రజలు అంటున్నారు.

# సమస్యలు వలయంలో మదనాపురం సోషల్ వెల్ఫేర్ గురుకుల (బాలురు) పాఠశాల

- సీఎం రాకతో గురుకుల విద్యార్థుల సమస్యలు తిరేనా..?
- 15న కొత్తకోటకు సీఎం రేవంత్ రెడ్డి
- కొత్తకోటకు కుత్త పెట్టు దూరంలో గురుకుల పాఠశాల
- విద్యుత్ షాక్ తో విద్యార్థి గాయాలు
- మరుగుదొడ్లు, స్థానాలు గదుల్లో నీటి వసతి లేక విద్యార్థుల అవస్థలు
- పేరుకుపోయిన చెత్తచెద్దరం
- విద్యార్థులకు రక్షణ ఎక్కడ




జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయాలంటున్న విద్యార్థులు వనపర్తి జిల్లా బ్యూరో జులై 13 (విజన్ ఆంధ్ర ): పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు సరైన సౌకర్య లేక తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలురు పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మదనాపురం గురుకులంలో పర్యవేక్షణ లేకపోవడం వల్ల గత 20 రోజుల క్రితం విద్యార్థి విద్యుత్ షాక్కు గురైన విషయాన్ని గురుకుల సిబ్బంది రహస్యంగా ఉంచారు. పేద విద్యార్థుల చదువుల కోసం ప్రభుత్వం అనేక పథకాలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం గురుకులంలో సౌకర్యాలు కల్పించాలని లక్ష్యంతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. గురుకుల పాఠశాలలో విద్యుత్ నియంత్రణ సక్రమంగా లేకపోవడం వల్ల విద్యార్థి విద్యుత్ శాఖ గురయ్యాడని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురుకుల పాఠశాలలో సరైన బాత్రూంలో మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు



పేర్కొంటున్నారు. గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవడం వల్ల విద్యార్థులు బైర్ భూమికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడ ఏ విషపురుగు సంచరిస్తుందో అని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు స్థానాలు అరుబయట చేయాలిసిన పరిస్థితి నెలకొంది.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం బోధన సిబ్బందిని ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం లో బోధించడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మదనపురం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి పరిశీలించి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. విద్యార్థుల భద్రత పర్యవేక్షణ గురుకులంలో కొరబడిందని దీంతో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మదనాపురం సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ను ఫోన్ ద్వారా సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు. విద్యార్థుల భద్రత పైన సౌకర్యాల పైన జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి పరిశీలన చేయాలని, గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.